


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 249 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల గురువారం 14 మే 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 249 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA THU 14 MAY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## అమూల్ పాల ధరలు పెరిగాయి... నేటి నుంచే!

- లీటర్‌కు రూ.2 చొప్పున పెంచుతూ నిర్ణయం
- పాల రకాన్ని బట్టి 2.5 శాతం నుంచి 3.5 శాతం మేర ధరల పెరుగుదల
- మదర్ డెయిరీ పాల ధరలు కూడా పెంపు

పెన్ పవర్ డెస్క్:అమూల్, మదర్ డెయిరీలు పాలు, పాల పదార్థాల ధరలను పెంచాయి. ఇతర కంపెనీలు కూడా ఇదే దారిలో నడిచే అవకాశాలు ఉన్నాయి. అమూల్ బ్రాండ్లపై పాల ఉత్పత్తులు విక్రయించే గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ పాల ధరలను పెంచింది. లీటర్‌కు రూ.2 చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకుంది.


- మిగతా2లో

## హ్యాక్ చేయడం అసాధ్యం... శ్రీవాణి ట్రస్ట్ టికెట్లపై టీటీడీ క్లారిటీ

- కొంతమంది దళారులు భక్తులను తప్పుదోవ పట్టించి నకిలీ టిక్కెట్లు విక్రయిస్తున్నారన్న టీటీడీ
- అలాంటి వారిపై టీటీడీ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరిక
- శ్రీవాణి టికెట్ బుకింగ్ సైట్‌ను హ్యాక్ చేయడం సాధ్యం కాదన్న టీటీడీ

పెన్ పవర్ డెస్క్:సామాజిక మాధ్యమాల్లో శ్రీవాణి ట్రస్ట్ టికెట్ల బుకింగ్‌కు సంబంధించి వస్తున్న వార్తలపై తిరుమల తిరుపతి దేవ స్థానం (టీటీడీ) స్పం దించింది. కొంతమంది దళారులు భక్తులను తప్పుదోవ పట్టించి

2లో





## రాసి పెట్టుకోండి.. ధూళిపాళ్ల ఓడిపోవడం ఖాయం

- చలో మామిళ్లపల్లి కార్యక్రమంలో ధూళిపాళ్లపై అంబటి ఫైర్
- రైతుల ఇళ్లు, గోడౌన్లపై దాడి చేయించడం ఏమిటని ప్రశ్న
- లోకేశ్, పెమ్మసాని ఏం చెబితే ఐజీ అది చేస్తున్నారని విమర్శ

- మిగతా2లో

## చైనా గడ్డపై కాలుమోపిన ట్రంప్... బీజింగ్ లో ఘనస్వాగతం

- దాదాపు పదేళ్ల తర్వాత చైనాలో అమెరికా అధ్యక్షుడి పర్యటన
- బీజింగ్‌లో అడుగుపెట్టిన డొనాల్డ్ ట్రంప్
- అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో రెండు రోజుల పాటు కీలక చర్చలు
- వాణిజ్యం, ఇరాన్ యుద్ధం, తైవాన్ అంశాలపై ప్రధానంగా దృష్టి
- ట్రంప్ వెంట టెస్లా, యాపిల్ సీఈఓలతో కూడిన భారీ బృందం

- మిగతా2లో



## విచారణకు హాజరుకాలేకపోతున్నాను: పోలీసులకు బండి భగీరథ్ లేఖ

- వ్యక్తిగత కారణాల వల్ల హాజరుకాలేకపోతున్నట్లు వెల్లడి
- విచారణకు అందుబాటులోకి వచ్చేందుకు మరో రెండు రోజులు కావాలని విజ్ఞప్తి
- దర్యాప్తుకు సహకరిస్తానన్న బండి భగీరథ్
- విచారణకు హాజరయ్యేందుకు మరో తేదీని కేటాయించాలని విజ్ఞప్తి

పెన్ పవర్ డెస్క్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్, తనపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి బుధవారం

- మిగతా2లో





## సైబర్ నేరాలపై చంద్రబాబు ఉక్కుపాదం.. కట్టడికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్


- ఏపీలో సైబర్, ఆర్థిక నేరాలపై సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష
- రాష్ట్రవ్యాప్తంగా బాధితులు రూ. 652 కోట్లు నష్టపోయారని వెల్లడి
- రూ. 116 కోట్లను కాపాడగలిగిన సీఐడీ, బ్యాంకింగ్ వ్యవస్థ
- సైబర్ నేరాల కట్టడికి పటిష్టమైన యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశం
- విజయవాడ, విశాఖ, తిరుపతిలలో ఇప్పటికే సైబర్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో పెరిగిపోతున్న సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ నేరాల కట్టడికి పటిష్ఠమైన యాక్షన్ ప్లాన్ రూపొందించడమే లక్ష్యంగా సచివాలయంలో బుధవారం ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో సైబర్ నేరాల తీవ్రత, వాటిని అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు రాష్ట్రంలోని సైబర్ నేరాల పరిస్థితిని ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో సైబర్, ఆర్థిక నేరాలకు సంబంధించి '1930' టోల్ ఫ్రీ నెంబర్‌కు బాధితుల నుంచి ఏకంగా 9.29 లక్షల ఫిర్యాదులు అందాయని, ఇది సమస్య తీవ్రతకు అద్దం పడుతోందని తెలిపారు. ఇప్పటివరకు బాధితులు సుమారు రూ.652 కోట్ల మేర నగదును కోల్పోయారని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం పెట్టుబడుల పేరుతో జరుగుతున్న మోసాలే (ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్) అతిపెద్ద ఆర్థిక నేరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటితో పాటు ఫిషింగ్, విషింగ్, క్రెడిట్/డెబిట్ కార్డు మోసాలు, ఆన్‌లైన్ లోన్ ఫ్రాడ్స్, 'డిజిటల్ అరెస్ట్' వంటి కొత్త తరహా మోసాలతో ప్రజలు నిలువునా దోపిడీకి గురవుతున్నారని వివరించారు.అయితే, సీఐడీ సైబర్ క్రైమ్ విభాగం,

- మిగతా2లో

## ఏపీ ఆర్థిక వ్యవస్థకు కొత్త రూపు.. ఇకపై నెల నెలా డేటా సేకరణ

- ఆర్థిక వ్యవస్థ పటిష్టతే లక్ష్యం
- సామర్థ్యం పెంపుపై సీఎం చంద్రబాబు దృష్టి
- పటిష్ట ఆర్థిక వ్యవస్థకు సామర్థ్యం పెంపే మార్గం
- రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ప్రతీ నెలా గణాంకాల సేకరణ
- రాష్ట్రం నుంచి మండల స్థాయి వరకు ఉద్యోగులకు శిక్షణ
- ఆర్థిక విశ్లేషణకు ఏఐ టెక్నాలజీ వినియోగం
- 15 శాతం వృద్ధి సాధించి స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధన



పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. 15 శాతం వృద్ధిరేటును స్థిరంగా సాధించడం ద్వారానే స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాన్ని చేరుకోగలమని, దీనికోసం క్షేత్రస్థాయి నుంచి పక్కాగా, వేగంగా గణాంకాలు సేకరించాలని సూచించారు. బుధవారం నాడు సచివాలయంలో ప్రణాళిక శాఖపై నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే పూర్తిస్థాయి 'డేటా డ్రివెన్ గవర్నెన్స్'కు శ్రీకారం చుడతామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.ప్రస్తుతం త్రైమాసిక, వార్షిక ప్రాతిపదికన రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) అంచనాలు రూపొందిస్తున్నారని, దీనివల్ల వాస్తవ ఆర్థిక పరిస్థితిపై తక్షణ అవగాహన కలగడం లేదని సీఎం అభిప్రాయపడ్డారు. చారిత్రక డేటాపై ఆధారపడటం వల్ల విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందన్నారు. ఈ విధానాన్ని మార్చి, ప్రతీ నెలా రాష్ట్ర ఆర్థిక వృద్ధిని జిల్లా, మండల స్థాయిలో ట్రాక్ చేసేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఇందుకోసం జీఎస్‌డీపీ విధానాన్ని అర్థం చేసుకునేలా, రియల్‌టైమ్ పద్ధతిలో అంచనాలు రూపొందించేలా అధికారులకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు సిబ్బందికి మూడు నెలల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోని 5 జోన్లు, 28 జిల్లాలు, 175 నియోజకవర్గాలను కవర్ చేస్తూ ఈ శిక్షణ ఉండాలన్నారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గం నుంచి ముగ్గురు అధికారులను మాస్టర్ ట్రైనర్లుగా తీర్చిదిద్దాలని సూచించారు.

మరోవైపు, వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో ఏఐ ఆధారిత ఆర్థిక విశ్లేషణ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ప్రస్తుతం పర్యవేక్షణలో లేని ఆర్థిక సూచికలను కూడా గుర్తించి, వాటిని కూడా ట్రాక్ చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. సమీక్షలో జీఎస్‌డీపీ సామర్థ్య పెంపు, రాబోయే సర్వేలు, కేపీఐల ఆడిటింగ్ వంటి పలు కీలక అంశాలపై చర్చించారు.

- మిగతా2లో



## కిడారి శ్రావణ్ పెళ్లి వేడుకకు హాజరైన నారా లోకేష్..

- జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ వివాహానికి హాజరైన మంత్రి నారా లోకేష్
- పాడేరు సమీపంలో నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి
- మార్గమధ్యంలో ప్రజలను కలిసి వినతులు స్వీకరించిన లోకేష్
- పలుచోట్ల టీడీపీ శ్రేణులు, గిరిజనులతో ముఖాముఖి
- సోషల్ మీడియా ద్వారా పర్యటన వివరాలు వెల్లడి

- మిగతా2లో



## అమరావతిలో భారీ మెడికల్ ప్రాజెక్టు.. బొల్లినేని కాలేజీకి సీఎం చంద్రబాబు శంకుస్థాపన

- అమరావతి నిడమర్రులో బొల్లినేని మెడికల్ కాలేజీకి సీఎం చంద్రబాబు శంకుస్థాపన
- లక్ష మందికి నైపుణ్య శిక్షణ అందించి గ్లోబల్ మెడికల్ హబ్‌గా మార్చడమే లక్ష్యం
- గడువులోగా ప్రాజెక్టులు పూర్తి చేయాలని పారిశ్రామికవేత్తలకు స్పష్టమైన ఆదేశాలు
- అమరావతితో పాటు విశాఖ, రాయలసీమ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు వెల్లడి
- డిసెంబరు నాటికి దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ ఏపీలో ఏర్పాటు చేస్తామని ప్రకటన

- మిగతా2లో

## ఈ ప్రభుత్వం ఎంతకాలం పనిచేస్తుందో! అసెంబ్లీలో ఉదయనిధి స్టాలిన్ ఆసక్తికర వ్యాఖ్యలు

- విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్ ప్రభుత్వం
- చర్చ సందర్భంగా ప్రభుత్వం మనుగడపై ఉదయనిధి అనుమానాలు
- ప్రభుత్వానికి ఓటు వేసినందుకు ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారని వ్యాఖ్య

- మిగతా2లో



## రైతులకు గుడ్ న్యూస్.. పంటల మద్దతు ధరను పెంచుతూ కేంద్రం నిర్ణయం

- ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం
- రైతుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కీలక నిర్ణయాలు
- క్వింటాల్ వరికి రూ. 2,441గా మద్దతు ధర

- మిగతా2లో



# విచారణకు హాజరుకాలేకపోతున్నాను: పోలీసులకు బండి భగీరథ్ లేఖ

- మొదటి పేజీ తరువాయి

పోలీసుల విచారణకు హాజరుకాలేదు. వ్యక్తిగత కారణాల వల్ల తాను హాజరుకాలేకపోతున్నానని, విచారణకు అందుబాటులోకి వచ్చేందుకు రెండు రోజుల గడువు కావాలని పోలీసులకు లేఖ రాశాడు. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులకు మెయిల్ పంపించాడు.
మే 8వ తేదీన మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలతో భగీరథ్‌పై పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసులో భాగంగా బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు విచారణకు హాజరుకావాలని పోలీసులు నిన్న నోటీసులు జారీ చేశారు. అయితే, తక్కువ సమయంలో నోటీసులు అందాయని, తనపై వచ్చిన తప్పుడు ఆరోపణలకు వ్యతిరేకంగా ఆధారాలు, సమాచారం సేకరించేందుకు సమయం కావాలని భగీరథ్ పోలీసులకు రాసిన లేఖలో పేర్కొన్నారు. దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని ఆయన స్పష్టం చేశారు. విచారణకు హాజరయ్యేందుకు మరో తేదీని సూచించాలని కోరారు.
మరోవైపు, ఈ కేసులో పోలీసులు ఇప్పటికే కఠినమైన పోక్సో సెక్షన్ 5(1), 6ను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ సెక్షన్ల కింద నేరం రుజువైతే 20 ఏళ్లకు పైగా జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఈ కేసుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో దర్యాప్తు వేగవంతమైంది.
ఇదిలా ఉండగా, భగీరథ్ ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరగనుంది. తప్పుడు కేసు పెట్టి రూ.5 కోట్లు డిమాండ్ చేశారని బాధితురాలి కుటుంబంపై భగీరథ్ కరీంనగర్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

# ఎడిటర్ వ్యూ

## ఘర్ వాపసీ...వైసీపీ రివర్స్ షాక్ !

వైసీపీ నుంచి చాలా మంది నేతలు గత రెండేళ్ళుగా బయటకు పోయారు, వివిధ కారణాలతో అనేక మంది పార్టీకి గుడ్ బై కొట్టారు. ఫ్యాన్ నీడన తమకు ఉక్కబోతగా ఉందని చెప్పి మరీ తలాఖ్ అనేశారు. వైసీపీలో ఏళ్ళ తరబడి పనిచేసిన వారు పునాదుల నుంచి ఉన్న వారు వైఎస్సార్ కుటుంబంతో తరాలుగా పనిచేస్తున్న వారు కూడా పార్టీ గేటు దాటారు. ఇదంతా ఒక విధంగా ఆశ్చర్యంగా సాగింది. రాజకీయాల్లో ఇవన్నీ మామూలు అయినా ఏ పార్టీకి అయినా మొదటి నుంచి ఉన్న వారు కొనసాగుతారు. అయారాం గయారాం ల విషయం అందరికీ ఎరుకే. కానీ పునాదుల నుంచి ఉన్న వారే వెళ్ళి పోవడం అంటే అది వైసీపీకి కలవరం కలిగించే అంశమే అని కూడా విశ్లేషణలు ఉన్నాయి.

**కీలక నేతలే వెళ్ళారు :**

వైసీపీలో జగన్ తరువాత నంబర్ టూ అనిపించుకున్న విజయసాయిరెడ్డి పార్టీని వీడుతారని ఎవరూ కలలో కూడా అనుకోలేదు, ఆయన పార్టీ నుంచి చాలా సైలెంట్ గా నిష్క్రమించారు. అలాగే వైసీపీతోనే సర్వం అనుకున్న మాజీ మంత్రులు మోపిదేవి వెంకట రమణ, ఆళ్ల నాని, సామినేని ఉదయభాను, జగన్ బంధువు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వంటి వారు చాలా సులువుగా బంధాలను తెంపుకుని బయటకు వెళ్ళారు. ఇక మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు మాజీ ఎంపీల జాబితా చూస్తే చాలానే ఉంది. అంతవరకూ ఎందుకు ఎమ్మెల్సీలుగా ఇంకా చేతిలో అధికారం ఉన్నా కూడా వైసీపీ వద్దు అని పదవులు సైతం వదులుకుని వెళ్ళిన వారూ ఉన్నారు. అయితే వీరంతా వైసీపీ భారీ ఓటమికి సంబంధించిన బాధలోనో లేక కూటమి అధికారంలోకి వచ్చింది కాబట్టి సొంత ఇబ్బందుల వల్లనో వెళ్ళారని అంతా అనుకున్నారు. వైసీపీ అధినాయకత్వం కూడా అలాగే భావించి కొన్నాళ్ళకు అయినా వారంతా రిటర్న్ అవుతారు అని ఊహించింది.

**మా సమస్యలు ఎందుకు :**

అయితే ఇతర పార్టీలలో చేరి ఇబ్బందులు పడుతున్నా తాము వైసీపీలోకి తిరిగి వెళ్లేది లేదని చాలా మంది నేతలు బాహాటంగా ప్రకటిస్తున్నారు అంటే వైసీపీ అంటే వారికి ఎంతటి వెగటు పుట్టిందో అర్థం కావడం లేదని అంటున్నారు. తాజాగా ఒంగోలు జిల్లా దిగ్గజ నేత మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అయితే తాను ఎట్టి పరిస్థితిల్లోనూ వైసీపీ గడప తొక్కేది లేదని అన్నారు. తన భవిష్యత్తు అంతా జనసేనలోనే అని క్లారిటీ ఇచ్చారు. అయినా తనను టార్గెట్ చేసి తాను వైసీపీలోకి వస్తున్నారు అని ప్రచారం చేయిస్తున్నారు అని మండిపడ్డారు. తాను జనసేనలో ఒక వేళ ఇబ్బంది పడినా వైసీపీకి వచ్చిన నొప్పి ఏంటని బాలినేని ప్రశ్నించారు.

**థర్డ్ ఫోర్స్ అంటున్న సాయిరెడ్డి :**

వైసీపీ నుంచి వెళ్ళిన మరో కీలక నేత విజయసాయిరెడ్డి వీలైనపుడల్లా వైసీపీని విమర్శిస్తూనే ఉన్నారు. వైసీపీ అధికారంలోకి రావడం కష్టమని ఆయన జోస్యం చెబుతూ వస్తున్నారు. అంతే కాదు వైసీపీకి ఏపీని ఏలా అభివృద్ధి చేయాలో విజన్ లేదని లేటెస్ట్ గా ఆయన హాట్ కామెంట్స్ చేశారు. ఏపీలో టీడీపీకి వైసీపీకి ఆల్టర్నేషన్ గా థర్డ్ ఫోర్స్ రావాలని కూడా ఆయన గట్టిగా కోరుకుంటున్నారు. ఇదే విషయం పదే పదే చెబుతున్నారు. దాంతో విజయసాయిరెడ్డి ఇదిగో అదిగో వచ్చేస్తున్నారు అని జరుగుతున్న ప్రచారం అంతా ఒట్టిదే అని అంటున్నారు. ఇక ఇదే తీరున అనేక మంది మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారని అంటున్నారు. వీరంతా తమకు ఇతర పార్టీలలో చాన్స్ లేకపోయినా ఓకే కానీ తిరిగి వైసీపీలోకి వెళ్ళమని అంటున్నారు అంటే ఆలోచించాల్సిందే అంటున్నారు.

**వచ్చేది ఎవరు :**

ఈ నేపథ్యంలో వైసీపీ ఓటమి తరువాత పార్టీని పటిష్టం చేయాలని చూస్తోంది. చాలా చోట్ల పాత కాపులు లేక ఇబ్బందులు వస్తున్నాయి. దాంతో అనుభవం ఉన్న వారు గతంలో పార్టీలో పనిచేసిన వారు వస్తే ఘర్ వాపసీ కింద ఓకే చెబుతారు అన్న ప్రచారం ఉంది. మరి వైసీపీలోకి వచ్చే నాయకులు ఎవరు అన్నదే చర్చగా ఉంది. చిత్రమేంటి అంటే చాలా మంది ఏ పార్టీలో చేరకుండా వెయిట్ చేస్తున్నారు మరి వీరిలో ఎవరైనా తిరిగి వైసీపీ వైపు వస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది అంటున్నారు.

## సైబర్ నేరాలపై చంద్రబాబు ఉక్కుపాదం.. కట్టడికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్

- మొదటి పేజీ తరువాయి

బ్యాంకర్లతో కలిసి సమర్థవంతంగా పనిచేస్తూ రూ.116 కోట్లకు పైగా మొత్తాన్ని నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్లకుండా నిలువరించగలిగామని అధికారులు చెప్పడం కొంత ఊరటనిచ్చింది. 'గోల్డెన్ అవర్'లో తక్షణమే స్పందించడం ద్వారా ఇది సాధ్యమైందని తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలంటే పోలీస్ యంత్రాంగం, బ్యాంకర్ల మధ్య మరింత దృఢమైన సమన్వయం అవసరమని స్పష్టం చేశారు. ఇతరుల బ్యాంకు ఖాతాలను నేరగాళ్లు దుర్వినియోగం చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ఒక సమగ్ర 'ఏపీ సైబర్ పాలసీ'ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర స్థాయిలో సీఐడీ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ పనిచేస్తోందని అధికారులు తెలిపారు. ఇప్పటికే విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలలో ప్రత్యేక సైబర్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశామని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమీక్షలో హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఏపీ ఫోరెన్సిక్స్ సలహాదారు కేపీసీ గాంధీ, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, వివిధ బ్యాంకుల ఉన్నతాధికారులు పాలుపంచుకుని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

# రాసి పెట్టుకోండి.. ధూళిపాళ్ల ఓడిపోవడం ఖాయం

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని మామిళ్లపల్లి ఘటన ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. మొక్కజొన్న రైతులపై దాడులు జరిగాయని, అక్రమ కేసులు పెట్టారంటూ వైసీపీ చేపట్టిన 'చలో మామిళ్లపల్లి' కార్యక్రమంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు... ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రపై విరుచుకుపడ్డారు.
రైతుల ఇళ్లు, గోడౌన్లపై దాడులు చేయించడం ఏంటని అంబటి ప్రశ్నించారు. ప్రశ్నించే వారిపైనే దాడులు చేస్తారా అంటూ మండిపడ్డారు. "వచ్చే ఎన్నికల్లో ధూళిపాళ్ల నరేంద్ర ఓడిపోవడం ఖాయం, ఇది రాసుకోండి" అంటూ మూడేళ్ల ముందే ఆయన జోస్యం చెప్పారు. రైతుల కాలి ధూళికి ఆయన కొట్టుకుపోతారని వ్యాఖ్యానించారు.
మా కుటుంబంపై, మా కులంపై , మా పార్టీపై కక్ష కట్టి ఇలాంటి దాడులు చేస్తున్నారా అని అంబటి నిలదీశారు. గుంటూరు ఐజీ త్రిపాఠి ఖాకీ డ్రెస్ వేసుకోవడం లేదని, పచ్చ డ్రెస్ (టీడీపీ రంగు) వేసుకుంటున్నారని ఆరోపించారు. లోకేశ్, పెమ్మసాని ఏం చెబితే ఐజీ అది చేస్తున్నారని విమర్శించారు. తప్పు చేస్తే ఎంతటి పెద్ద అధికారినైనా చట్టప్రకారం శిక్షిస్తామని, తప్పుడు కేసులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. గోడౌన్‌లో సీజ్ చేసిన మొక్కజొన్నను వెంటనే విడుదల చేయాలని కోరారు. అరెస్టులకు భయపడేది లేదని, అవసరమైతే జైలుకు వెళ్లడానికైనా సిద్ధమని అంబటి రాంబాబు స్పష్టం చేశారు.

# అమూల్ పాల ధరలు పెరిగాయి... నేటి నుంచే!

- మొదటి పేజీ తరువాయి

(మే 14వ తేదీ) పెంచిన ధరలు అమల్లోకి వస్తాయని తెలిపింది. అమూల్ స్టాండర్డ్ మిల్క్, గేదె పాలు, ఆవు పాలు, గోల్డ్, స్లిమ్ అండ్ ట్రిమ్, టీ స్పెషల్ పాల ధరలు లీటరుకు రూ.2 చొప్పున పెరగనున్నాయి. అమూల్ గత సంవత్సరం మే 1వ తేదీన చివరిసారి ధరలను సవరించింది. ఉత్పత్తి వ్యయం పెరిగిన నేపథ్యంలో ధరల పెంపు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని అమూల్ తెలిపింది. పశువుల దాణా, ప్యాకేజింగ్ ఖర్చులు, చమురు ధరలు పెరుగుదల దీనికి కారణమని తెలిపింది. పాల రకాన్ని బట్టి లీటరుకు 2.5 నుంచి 3.5 శాతం మేర ధరలు పెరుగుతాయి.
మదర్ డెయిరీ కూడా పాల ధరను పెంచింది. లీటరుకు రూ.2 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది. మే 14 నుంచి పెరిగిన పాల ధరలు అమల్లోకి రానున్నాయని తెలిపింది.

# కిడారి శ్రావణ్ పెళ్లి వేడుకకు హాజరైన నారా లోకేష్..

రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటించారు. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ వివాహ వేడుకలో పాల్గొని, మార్గమధ్యంలో ప్రజలతో మమేకమయ్యారు. ఈ పర్యటన వివరాలను ఆయన స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. పాడేరు సమీపంలోని తుమ్మరమెట్టలో జరిగిన కిడారి శ్రావణ్ కుమార్, శ్రీప్రియల వివాహ మహోత్సవానికి లోకేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. తన పర్యటనలో భాగంగా, మార్గమధ్యంలో పలుచోట్ల ఆయన ప్రజలను కలిశారు. పాడేరు సమీపంలోని లగిశపల్లి వద్దకు భారీగా తరలివచ్చిన గిరిజన ప్రజలను పలకరించి, వారి నుంచి అర్జీలు స్వీకరించారు. అదేవిధంగా, వర్తనాపల్లి, నక్కలపుట్టు జంక్షన్‌లోనూ స్థానికుల నుంచి వినతులు స్వీకరించినట్లు లోకేష్ తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను కూడా ఆయన కలిశారు. ఈ పర్యటనకు సంబంధించిన ఫొటోలను తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు.

# రైతులకు గుడ్ న్యూస్.. పంటల మద్దతు ధరను పెంచుతూ కేంద్రం నిర్ణయం

ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం దేశవ్యాప్తంగా ఉన్న రైతాంగానికి భారీ ఊరటనిచ్చింది. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది.
రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా, ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరను ప్రభుత్వం పెంచింది. పెట్టుబడి ఖర్చుపై 50 శాతం అదనంగా కలిపి కొత్త ధరలను ఖరారు చేశారు. వరి క్వింటాల్‌కు రూ. 2,441 గా నిర్ణయించారు. గ్రేడ్-ఏ వరి క్వింటాల్‌కు రూ. 2,461 గా మద్దతు ధరను ఖరారు చేశారు. ఈ ఖరీఫ్ సీజన్ మద్దతు ధర కోసం కేంద్రం ఏకంగా రూ. 2.6 లక్షల కోట్లను కేటాయించడం విశేషం. వ్యవసాయంతో పాటు రవాణా, ఇంధన రంగాలకు కూడా కేంద్ర కేబినెట్ పెద్దపీట వేసింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోదం తెలిపారు. ఇంధన భద్రత కోసం ఈ పథకానికి రూ. 37,500 కోట్లు కేటాయించారు. సర్ఖేజ్ - ధోలేరా మధ్య సెమీ హై స్పీడ్ డబుల్ రైల్వే లైన్ నిర్మాణం కోసం రూ. 20,065 కోట్లు మంజూరు చేస్తూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

# అమరావతిలో భారీ మెడికల్ ప్రాజెక్టు.. బొల్లినేని కాలేజీకి సీఎం చంద్రబాబు శంకుస్థాపన

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి వైద్య, నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దే బృహత్ ప్రణాళికకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా, నిడమర్రులో "బొల్లినేని ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్" (బొల్లినేని మెడికల్ కాలేజీ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ) నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ గంటి హరీష్, రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై తన దార్శనికతను, ప్రభుత్వ ప్రణాళికలను ఆవిష్కరించారు. చిన్న స్థాయిలో ప్రారంభమైన కిమ్స్ ఆస్పత్రి ఇప్పుడు రూ.30 వేల కోట్ల సంస్థగా ఎదిగిన విషయాన్ని గుర్తుచేస్తూ, పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తేనే రాష్ట్రానికి, దేశానికి సంపద సృష్టి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అమరావతి అభివృద్ధికి అనేకమంది పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**గడువులతో కూడిన జవాబుదారీతనం**

"గతంలో రాష్ట్రంలో 23 నెలల పాటు విధ్వంసం, అరాచకం చూశాను. అలాంటి పాలన నా జీవితంలో చూడలేదు. ఇప్పుడు శంకుస్థాపనలతో ఆగిపోకుండా, నిర్దేశిత గడువులోగా ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు కూడా జరుపుకోవాలి" అని చంద్రబాబు అన్నారు. ఈ మెడికల్ కాలేజీ, యూనివర్సిటీ నిర్మాణం 2027 నాటికి పూర్తి కావాలని ఆకాంక్షించారు. ఇటీవలే శంకుస్థాపన చేసిన గూగుల్ క్యాంపస్‌ను 2028 ఆగస్టుకు, ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ మొదటి దశను 2028 డిసెంబరుకు పూర్తి చేయాలని ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. "అనుమతులు ఆటోపైలట్ మోడ్‌లో ఇచ్చే బాధ్యత మాది. నిర్మాణాలు పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభించే బాధ్యత పారిశ్రామికవేత్తలది" అని భరోసా ఇచ్చారు.

**బొల్లినేని ప్రాజెక్టు వివరాలు**

మొత్తం 25 ఎకరాల్లో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. ఇందులో 23 ఎకరాల్లో మెడికల్ కాలేజీ, 2 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు కానుంది. 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, 250 మెడికల్ సీట్లు, 1000 నాన్-మెడికల్ సీట్లు, మరో 1000 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. తద్వారా లక్ష మందికి నైపుణ్యం అందించి, ప్రపంచవ్యాప్తంగా వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బందికి ఉన్న డిమాండ్‌ను తీర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. "ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్య సిబ్బందిలో ఒకరికి అమరావతిలోనే శిక్షణ ఇచ్చే స్థాయికి ఈ సంస్థ ఎదగాలి," అని సీఎం ఆకాంక్షించారు.

**రాష్ట్ర సమగ్ర అభివృద్ధి ప్రణాళిక**

ముఖ్యమంత్రి తన ప్రసంగంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలను వివరించారు.
టెక్నాలజీ: దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్‌ను ఈ ఏడాది డిసెంబరు నాటికి అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.
పరిశ్రమలు: రాయలసీమలో ఈ నెల 15న ఫైటర్ జెట్ పరిశ్రమకు శంకుస్థాపన చేయనున్నట్లు, కర్నూలును డ్రోన్ సిటీగా, శ్రీసిటీని ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.
నగరాభివృద్ధి: అమరావతితో పాటు విశాఖను కూడా విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.
హరిత ఇంధనం: విదేశాలపై ఆధారపడకుండా, ప్రతి ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్‌లతో విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ప్రజలపై మోపిన రూ.32 వేల కోట్ల విద్యుత్ భారాన్ని తగ్గించామని, ఛార్జీలు పెంచకుండా తగ్గిస్తున్నామని పేర్కొన్నారు.
ఆరోగ్య రంగం: రాష్ట్ర బడ్జెట్‌లో వైద్యారోగ్యశాఖకు రూ.20 వేల కోట్లు కేటాయించామని, సంజీవని ద్వారా డిజిటల్ వైద్య సేవలు అందిస్తామని చెప్పారు.

రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాన్ని స్మరించుకున్న చంద్రబాబు, వారి భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అమరావతిని భవిష్యత్ నగరంగా నిర్మించి, రాష్ట్ర యువతకు లక్షల ఉద్యోగాలు కల్పించడమే తన ఆలోచన అని స్పష్టం చేశారు.

# చైనా గడ్డపై కాలుమోపిన ట్రంప్... బీజింగ్ లో ఘనస్వాగతం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా గడ్డపై కాలుమోపారు. బుధవారం ఆయన బీజింగ్ చేరుకున్నారు. దాదాపు ఒక దశాబ్దం తర్వాత అమెరికా అధ్యక్షుడు చైనాలో పర్యటించడం ఇదే ప్రథమం. బీజింగ్ క్యాపిటల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ట్రంప్‌కు చైనా ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్ సైనిక గౌరవ వందనంతో ఘనస్వాగతం పలికారు. రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ట్రంప్, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో ఉన్నతస్థాయి సమావేశంలో పాల్గొంటారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం, వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు, టెక్నాలజీ పోటీ నెలకొన్న తరుణంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ చర్చల్లో ప్రధానంగా వాణిజ్యం, ఇరాన్ యుద్ధం, తైవాన్‌కు అమెరికా ఆయుధాల విక్రయం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), చిప్స్ వంటి సాంకేతిక అంశాలపై దృష్టి సారించనున్నారు. ఇరు దేశాల మధ్య ప్రస్తుతం ఉన్న తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని (ట్రేడ్ ట్రూస్) స్థిరీకరించుకోవాలని రెండు దేశాలూ భావిస్తున్నాయి. అమెరికా వ్యాపారాలు, వ్యవసాయ ఉత్పత్తుల కోసం చైనా మార్కెట్లను మరింతగా అందుబాటులోకి తీసుకురావాలని ట్రంప్ కోరుతున్నారు. ఇరాన్‌కు చైనా అందిస్తున్న ఆర్థిక, వ్యూహాత్మక మద్దతును నిలిపివేయాలని ఆయన ఒత్తిడి తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటనలో ట్రంప్‌తో పాటు టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్, యాపిల్ సీఈఓ టిమ్ కుక్, ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ వంటి ప్రముఖ పారిశ్రామికవేత్తలతో కూడిన భారీ బృందం పాల్గొంటోంది. ఈ భేటీలో కుదిరే ఒప్పందాలు ప్రపంచ రాజకీయ, ఆర్థిక సమీకరణాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

# ఈ ప్రభుత్వం ఎంతకాలం పనిచేస్తుందో! అసెంబ్లీలో ఉదయనిధి స్టాలిన్ ఆసక్తికర వ్యాఖ్యలు

తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా ఎన్నికైన టీవీకే అధినేత విజయ్ అసెంబ్లీలో తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో స్పష్టమైన మెజారిటీతో విజయ్ ప్రభుత్వం నెగ్గింది. విశ్వాస పరీక్షకు ఓటింగ్ సందర్భంగా డీఎంకే సభ నుంచి వాకౌట్ చేసింది. విశ్వాస పరీక్ష సందర్భంగా ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ సభలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొత్త ప్రభుత్వాన్ని ఉద్దేశించి, ఈ ప్రభుత్వం ఎంతకాలం మనుగడ సాగిస్తుందోనని రాష్ట్ర ప్రజలు ప్రశ్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎంతకాలం మనుగడ సాగిస్తుందో తెలియని ప్రభుత్వానికి ఓటు వేసినందుకు ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారని అన్నారు. తమిళనాడులో లౌకికవాద ప్రభుత్వమే ఉండాలని ఆకాంక్షించారు. ఎన్నికల్లో రాష్ట్రంలోని దాదాపు 65 శాతం మంది ఓటర్లు ముఖ్యమంత్రి విజయ్, టీవీకేను తిరస్కరించారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మిత్రపక్షాలతో కలిసి అధికారంలోకి వచ్చారని, కనీసం ఇప్పుడైనా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే రీతిలో పనిచేయాలని సూచించారు. ఎందు కంటే మీకు ఓటు వేసిన ప్రజలే ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందోనని ప్రజల్లో అనుమానాలు నెలకొన్నాయని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కొత్త ప్రభుత్వానికి సూచించారు. విశ్వాస ఓటింగ్‌లో తమ పార్టీ పాల్గొనడం లేదని, డీఎంకే ఎమ్మెల్యేలం వాకౌట్ చేస్తున్నామని
ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. డీఎంకేతో పాటు మిత్రపక్షమైన ఎంఎంకే కూడా విశ్వాస పరీక్షను వ్యతిరేకించింది. మంత్రివర్గంలో ముస్లింలకు ప్రాతినిధ్యం లేకపోవడాన్ని ఆ పార్టీ నాయకుడు జవహిరుల్లా ప్రస్తావించారు. డీఎంకే మరో మిత్రపక్షం ఎండీకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసింది. విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వానికి కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు ప్రకటించాయి. ఏఎంఎంకే పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యే ఎస్. కామరాజ్ కూడా ప్రభుత్వానికి మద్దతు పలికారు. దీంతో ఆయనను ఏఎంఎంకే పార్టీ నుంచి బహిష్కరించారు.

# హ్యాక్ చేయడం అసాధ్యం... శ్రీవాణి ట్రస్ట్ టికెట్లపై టీటీడీ క్లారిటీ

- మొదటి పేజీ తరువాయి

నకిలీ టికెట్లు విక్రయిస్తున్నారని పేర్కొంది. అలాంటి వారిపై టీటీడీ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించింది. శ్రీవాణి దర్శన టికెట్లపై ఎలాంటి అసత్య ప్రచారాన్ని భక్తులు నమ్మవద్దని కోరింది.
శ్రీవాణి ట్రస్ట్ టికెట్ల బుకింగ్ విధానాన్ని 2019 మే నెలలో ప్రవేశపెట్టినట్టు గుర్తు చేసింది. ఇందులోని లోటుపాట్లు, భక్తుల నుంచి వచ్చే సూచనలు, సలహాల మేరకు 2024 జూన్ నుంచి భక్తులకు పారదర్శకంగా సేవలందించేందుకు బుకింగ్ విధానాన్ని పటిష్ఠంగా రూపొందించినట్లు తెలిపింది. కాబట్టి శ్రీవాణి టికెట్ బుకింగ్ సైట్‌ను హ్యాక్ చేయడం, వ్యవస్థలో చొరబడటం సాధ్యం కాదని స్పష్టం చేసింది. భక్తులు అపోహలకు గురికావొద్దని కోరింది. కొందరు దళారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఆటో ఫిల్లింగ్, ఆటో కాపీయింగ్ వంటి పద్ధతుల ద్వారా వేగంగా వివరాలు నమోదు చేసి టికెట్లను బుక్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపింది. అలాంటి వాటిని టీటీడీ ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత అక్రమ ఐడీలు, అక్రమ బుకింగ్ విధానాలను వెంటనే నిరోధించడంతో పాటు సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు అప్ డేట్ చేస్తున్నట్లు తెలిపింది. నిరంతరం నిఘా ఉంచుతున్నట్లు తెలిపింది.

# ఉత్తమ ప్రతిభావంతులైనజర్నలిస్టులకు అవార్డులు..







విజయవాడ,పెన్ పవర్,మే. 13, జర్నలిజం రంగంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన మీడియా ప్రతినిదులు 2025-26సంవత్సరానికి గాను అవార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ అన్నారు. స్థానిక మీడియా అకాడమీ కార్యాలయంలో సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ తో కలిసి బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అవార్డుల ఎంపిక, ప్రదానం కోసం మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ఛైర్మన్ గా నలుగురు సభ్యులతో కూడిన కమిటీ ని ప్రభుత్వం నియమించిందని ఆయన వెల్లడించారు. ఇండియా టుడే పూర్వ ఎడిటర్ ఏ.ఏ.వి. ప్రసాద్, ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం ఇంచార్జి వైస్ ఛాన్సలర్ ప్రొ.డి.వి.ఆర్. మూర్తి, రిటైర్డ్ హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్యన్నారాయణ మ్మూర్తి సభ్యులుగాను, సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ మెంబర్ కన్వీనర్ గాను వ్యవహరిస్తారన్నారు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో జారీ అయిన ఉత్తరువుల ప్రకారం 12 అవార్డులను ఇవ్వనున్నట్లు చైర్మన్ తెలిపారు. వీటిలో కొన్నింటిని కమిటీ విచక్షణ తో, మరి కొన్నిటిని దరఖాస్తులు కోరి అర్హులైన వారిని ఎంపిక చేస్తామన్నారు. లైఫ్ టైం అఛీవ్ మెంటు అవార్డుకు రూ. 3 లక్షలు, ఉత్తమ జర్నలిస్టు, ఉత్తమ ఫోటో జర్నలిస్టు అవార్డులకు రూ. 2 లక్షలు చొప్పున, మిగిలిన అవార్డులకు రూ 1 లక్ష చొప్పున ప్రైజ్ మని ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆయా అవార్డులకు అర్హతలు, దరఖాస్తుకు చివరి తేదీ లను తెలుపుతూ ప్రకటన విడుదల చేయడం జరుగుతుందన్నారు. జర్నలిస్టుల అవార్డులకు సంబంధించి కనీస అనుభవం మాత్రమే పేర్కొనడం జరిగిందని, దానికి, అక్రిడేషన్లకు సంబంధం లేదని చైర్మన్ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ శ్రీ కె.ఎస్. విశ్వనాథన్ మాట్లాడుతూ జర్నలిస్టుల అవార్డులు ప్రతి యేటా ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించిందని అన్నారు. 2017 తరువాత మళ్ళీ 2025-26 సంవత్సరానికి ఉత్తమ ప్రతిభ కనపరిచిన జర్నలిస్టులకు అవార్డులు ఇచ్చే సాంప్రదాయాన్ని ప్రభుత్వం పునరుద్ధరించిందని ఆయన తెలిపారు. ఒక వారం రోజుల్లో అవార్డులకు సంబంధించిన ప్రకటనను విడుదల చేసి, అవార్డులకు అర్హులైన జర్నలిస్టులను గుర్తించి జులై నెల లో అవార్డుల ప్రదానం జరిగే లా కృషి చేయడం జరుగుతోందని ఆయన తెలిపారు. పాత్రికేయుల సమావేశంలో సి.ఆర్. మీడియా అకాడమీ సెక్రెటరీ వి. మణిరాం, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ ఐ. సూర్య చంద్ర రావు, డిప్యూటీ డైరెక్టర్ డి. రమేష్, సి.ఆర్. మీడియా అకాడమీ మేనేజర్ ఎం.భాస్కర నారాయణ విజయవాడ రాష్ట్ర సమాచార కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వి. మోహన రావు పాల్గొన్నారు...

# పెన్ పవర్ సెంట్రల్ ఆంధ్ర

కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# సూరేపల్లి లో ప్రకృతి వ్యవసాయం పై శిక్షణ కార్యకమం


భట్టిప్రోలు, పెన్ పవర్,మే, 13: మండలంలోని సూరేపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి బి బ్రహ్మారెడ్డి అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యకమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మధు మోహన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎం మధుమోహన్ మాట్లాడుతూ,ప్రతీ ఒక్కరూ రసాయన ఎరువుల,పురుగు మందుల వాడకం క్రమంగా తగ్గించుకుంటూ పూర్తిగా ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని కోరారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా లాభాలు ఆర్జించ వచ్చని,దానికి నిబద్దత మరియు ప్రకృతి పట్ల విచక్షణ ఉండాలని అన్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల అంచనా ప్రకారం ఎల్ నినో ప్రభావం కారణం చేత ఈ సంవత్సరం వర్షాలు ఆలస్యంగా కురుస్తాయి కావున ప్రతీ రైతూ ఈ సమయంలో వారి పొలాల్లో పీఎండి యస్




కిట్లు వేసుకుని సాగు చేయటం ద్వారా నేల సారవంతం అవుతుందని, తదుపరి వేసే ప్రధాన పంట సమయంలో ఎరువుల వినియోగం గణనీయంగా తగ్గించ వచ్చునని సూచించారు.ప్రకృతి వ్యవసాయం చేస్తూ లాభాలని ఆర్జిస్తున్న రైతుల అనుభవాల్ని వివరించారు. తదుపరి మండల వ్యవసాయ అధికారి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ , రానున్న కాలంలో ప్రకృతి వ్యవసాయం ఎక్కువగా అవలంబిస్తారన్నారు. వినియోగ దారుల మార్కెట్ లో ప్రకృతి వ్యవసాయం లో పండించిన పంటలకు బాగా డిమాండ్ ఉన్నదని,ఇటువంటి పద్దతుల్లో వ్యవసాయం చేసి ప్రతీ రైతూ లాభం పొందాలని సూచించారు.

పెదపులివర్రు లో.. పెదపులివర్రు గ్రామంలోని ఏటీఎం మోడల్ పొలాన్ని సందర్శించటం జరిగింది.ప్రకృతి వ్యవసాయం అవలంబించే రైతులు,ద్రవ జీవామృతం,బీజమృతం తయారీ పద్దతులను,పద్దతి ప్రదర్శన ద్వారా క్షేత్రంలోనే తయారు చేసి చూపించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఇఓ లు, విఎఎలు,ఏపీ సీ ఎయన్ ఎఫ్ మాస్టర్ ట్రైనర్,మండల కోఆర్డినేటర్,సిబ్బంది పాల్గొన్నారు.

# హెచ్చరికలు చేసినా పట్టించుకోని అధికారులు -- ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న ఓవర్‌లోడ్ లారీలు..






గుంటూరు, పెన్ పవర్, మే, 13, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అధికారుల నిర్లక్ష్యంతో హెవీ లోడ్ ఇసుకతో, నీరు కారుతున్న లారీలు నగరంలో తిరగడం వలన వేసిన రోడ్లు 2నెలలకే దెబ్బ తినటమే కాక, ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా తయారు అవుతున్నదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి టీడీపీ నేత బెల్లంకొండ సురేష్ మృతి చెందిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తిరిగి వస్తున్న సమయంలో పట్టాభిపురం బ్రిడ్జి వద్ద హెవీ లోడ్ ఇసుక లారీలు రోడ్లను దెబ్బతీస్తున్న తీరును ప్రత్యక్షంగా గమనించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఇటీవలే ప్రజల సౌకర్యార్థం కొత్తగా రోడ్లు వేయించామని, కానీ 70 టన్నులకు పైగా లోడ్‌తో నీళ్లు కారుస్తూ వెళ్తున్న ఇసుక లారీల కారణంగా రోడ్లు 2 నెలల్లోనే పూర్తిగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ లోడ్‌తో వెళ్తున్న లారీల కారణంగా రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రజలు తీవ్ర అసౌకర్యంతో పాటు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ప్రత్యేకంగా పట్టాభిపురం బ్రిడ్జి ప్రాంతంలో పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారుతోందని, రాత్రివేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఓవర్‌లోడ్ లారీలు నీళ్లు కారుస్తూ వెళ్లడం వల్ల ద్విచక్ర వాహన దారులు జారీ పడటమే కాక, రోడ్డు త్వరగా దెబ్బతింటోందని పేర్కొన్నారు. గతంలోనే హెవీ లోడ్ లారీల వ్యవహారంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టంగా ఆదేశించినప్పటికీ, కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం బాధాకరమన్నారు. హెచ్చరికలు చేసినా పట్టించుకోకుండా ఓవర్‌లోడ్ లారీలు యథేచ్ఛగా తిరుగుతుండటం అధికారుల వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. రోడ్ల రక్షణతో పాటు ప్రజల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు.

# నా నగరం - నా బాధ్యత అని ప్రతి ఒక్కరూ భావించాలి...జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ..





విజయవాడ, పెన్ పవర్, మే, 13, నా నగరం నా బాధ్యత అంటూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ మరియు విజయవాడ నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా బి.ఆర్.టి.ఎస్ రోడ్డు ఫుడ్ జంక్షన్ నుండి భగత్ సింగ్ రోడ్ వరకు కాలినడకన పారిశుధ్య నిర్వహణపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కాలుష్య రహిత నగరాన్ని నిర్మించేందుకు ఎండ్ టు ఎండ్ రోడ్లు ఉండేటట్టు చర్యలు తీసుకుంటున్నామని తద్వారా డస్ట్ లేకుండా కాలుష్యాన్ని తగ్గించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ--2026 కార్యక్రమంలో భాగంగా నగరంలో స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ మరియు విజయవాడ నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి లక్ష్మీశ ప్రత్యేక శుభ్రత కార్యక్రమంలో పాల్గొని తామే స్వయంగా చీపురు పట్టుకొని రహదారి పరిసరాల్లో శుభ్రత నిర్వహిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. నగర పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత అని, స్వచ్ఛమైన విజయవాడ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు స్వచ్ఛ సర్వేక్షణ ఓటింగ్‌లో చురుకుగా పాల్గొని విజయవాడకు ఉత్తమ ర్యాంకు తీసుకురావాలని కోరారు. మరోవైపు టిఫిన్ బండ్ల వద్ద వారు వేడివేడి ఆహారాన్ని సింగల్ యూస్ ప్లాస్టిక్ కవర్ పై వేయటం వలన ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, నగరంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కర్రీ పాయింట్ల వద్ద టిఫిన్ బండ్ల వద్ద వేడి వేడి ఆహారాన్ని 120 మైక్రోన్స్ కంటే తక్కువగా ఉన్న సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లలో వేయటం వల్ల, ఆ ప్లాస్టిక్ వేడిలో కరిగి ఆహారం ద్వారా శరీరం లోపలికి వెళ్లి క్యాన్సర్కి కారకాలు అవుతాయని అన్నారు. ఒకవైపు అధికారులు అధికారులు సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్నప్పటికీ ప్రజలు కూడా తమ వైపు నుండి సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మారివేయాలని పర్యావరణహితమైన వస్తువులనే వాడేటట్టు వారు కూడా బాధ్యత వహించాలని అన్నారు. నగరంలోని భవన నిర్మాణాలను ప్రజలు సరిగా నిర్వహించకుండా కాలువల్లో పారి వేయటం వల్ల కాలువలు నిండిపోయి దోమలు వచ్చే అవకాశాలు నందున ప్రజలు అభ్యర్థాలను విజయవాడ నగరపాలక సంస్థ వారికి అందించాలని వియంసిపారు భవనం వ్యర్థాల నుండి ఇటుకలు ఫీవర్ బ్లాక్స్ వంటి సంపదను సృష్టించే వస్తువులను తయారు చేస్తారని అన్నారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ. శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు....

# అభివృద్ధి పనులు పూర్తైన ప్రాంతాల్లో నిర్మాణ వ్యర్థాలను ప్రజలకు ఇబ్బంది లేకుండా తొలగించాలి..నగర కమిషనర్ కె.మయూర్ అశోక్...





గుంటూరు, పెన్ పవర్, మే, 13, బుధవారం ఇన్నర్ రింగ్ రోడ్, గాయత్రి నగర్, ఆటో నగర్ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించి, పనుల వేగవంతంపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్ 2లో జరుగుతున్న డ్రైన్ పనులను పరిశీలించి, ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతూ పనులు చేపట్టడానికి ముందే మార్కింగ్ ని పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి చేయాలని, తద్వారా పనుల్లో సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. పనులు పూర్తైన ప్రాంతాల్లో సదరు కాంట్రాక్టరే నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని స్పష్టం చేశారు. సదరు ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న నూతన పార్క్ పనులను తనిఖీ చేసి, 2 వారాల్లోగా సివిల్ వర్క్ లు పూర్తి చేయడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని డిఈఈకి తెలిపారు. డ్రైన్ నిర్మాణాలు, రోడ్ల విస్తరణ సమయాల్లో విద్యుత్ స్తంభాలు షిఫ్ట్ చేసిన తర్వాతనే పనులు ప్రారంభించాలన్నారు. బహుళ అంతస్తు నిర్మాణదారులు డ్రైన్ ని అవుట్ ఫాల్ లేదా మేజర్ డ్రైన్ లోకి కలిపితేనే తదుపరి అనుమతులు ఇచ్చేలా పట్టణ ప్రణాళిక అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్ లో ఖాళీ స్థలాల్లోకి డ్రైనేజి వదిలే అపార్ట్మెంట్ లకు పబ్లిక్ హెల్త్ అధికారులు నోటీసులు జారీ చేయాలన్నారు. ఆటో నగర్ రోడ్ వెంబడి లో లెవల్ ఏరియాల్లో మెరక చేయాలని ఏఈని, సదరు ప్రాంతాల్లో వ్యర్థాలు వేయకుండా పర్యవేక్షణ చేయాలని శానిటరీ ఇన్స్పెక్టర్ ని ఆదేశించారు.

ఆటోనగర్ వ్యర్థాలు సేకరణకు నిర్దేశిత విధానం ఏర్పాటు చేసుకునేలా సదరు అధికారులతో సమన్వయం చేయాలని అదనపు కమిషనర్ ని ఆదేశించారు.పర్యటనలో అదనపు కమిషనర్ (ఇంచార్జి) జి.సాంబశివరావు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఈఈ(ఇంచార్జి) కళ్యాణరావు, డిఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్ ఐజాక్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రపంచ వేదికపై భారత్ ఎదుగుతున్న శక్తి : డాక్టర్ కె ఎస్ కన్నన్

వి.కోట (చిత్తూరు) : పెన్ పవర్, మే, 13 భారతదేశం ప్రపంచ వేదికపై ఎదుగుతున్న శక్తిగా అవతరిస్తుందని డాక్టర్ కె ఎస్ కన్నన్ పేర్కొన్నారు. వికసిత్ భారత్ ఏ 2047 లక్ష్యాన్ని ప్రతిబింబించే గ్రంథ ఆవిష్కరణ తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ లోని పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయసెనేట్ హాల్లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వి కోట బాలల ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ కె ఎస్ కన్నన్ ప్రత్యేక ఆహ్వానితులు గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా విధానం ప్రజాస్వామ్యం పాలన, జాతీయ అభివృద్ధిలో ఇంటర్ డిసప్లనరీ పరిశోధన ప్రాముఖ్యతను వివరించినట్లు వారు పేర్కొన్నారు. అదేవిధంగా భారతదేశం ప్రపంచ వేదికలపై ఎదుగుతున్న శక్తిగా అవతరిస్తుందని ఈ గ్రంథం జాతీయ, అంతర్జాతీయ అంశాలపై నాణ్యమైన పరిశోధనలకు దోహదపడుతుందని




తెలిపారు. కాన్ఫరెన్స్ డైరెక్టర్, ఎడిటర్ ప్రొఫెసర్ బి వి మురళీధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఉప కులపతి ప్రొఫెసర్ నరసింహారావు ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు వారు తెలిపారు. విశ్వవిద్యాలయాలు పరిశోధన జ్ఞాన సృష్టి ద్వారా దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలన్నారు. అంతర్జాతీయ స్థాయి అకడమిక్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన టీం సభ్యులను అభినందించడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులు, ఎడిటర్ గా పాల్గొన్న డాక్టర్ కె ఎస్ కన్నన్ వి కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు), లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్నారు. వారు ఇప్పటివరకు 32 జాతీయ, అంతర్జాతీయ సెమినార్లు మరియు వెబినార్లలో పాల్గొని 20 పరిశోధనా వ్యాసాలు ప్రచురించారు. 6 విద్యా, పరిశోధనాత్మక గ్రంథాల ప్రచురణలో భాగస్వామ్యమై, ఒక గ్రంథానికి సబ్ ఎడిటర్ గా, ప్రస్తుత గ్రంథానికి ఎడిటర్ గా వ్యవహరించడం ఆయన విద్యా ప్రస్థానంలో విశిష్ట సాధనగా నిలిచింది.

# కదిరి రోడ్డులో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ ధర్నా

మదనపల్లె అర్బన్ (అన్నమయ్య): పెన్ పవర్, మే, 13 ఒకే దేశం.. ఒకే పరీక్ష, నీట్ స్కాంల వల్ల 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారమైందని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని కదిరి రోడ్డులో బుధవారం ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎన్టీఏ ను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వాలే నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహించాలని నినాదాలు చేశారు. వైద్య విద్యా ఆశావహులైన విద్యార్థులను మానసికంగా హింసించిన ఎన్డీఏ సర్కార్ ప్రభుత్వం నుండి తప్పుకోవాలని, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని నినాదాలు చేశారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ సర్వేపల్లి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్ లు మాట్లాడుతూ వరుస నీట్ స్కామ్ లకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్రన్ రాజీనామా చేయడంతో పాటు కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. కేంద్రంలోని జేఈఈ, నీట్ పరీక్షలు నిర్వహించే ఎన్.టి.ఏ. ను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించాలన్నారు. నీట్ పరీక్షకు 43 గంటల ముందే రాజస్థాన్ లోని సీకర్ వాట్సాప్ లోకి కెమిస్ట్రీ, బయాలజీ విభాగాల్లో 130 నుంచి 140 ప్రశ్నలు వచ్చాయంటే నిర్వహణలో డొల్లతనం తేటతెల్లమౌతోందన్నారు. ఆ ప్రశ్నలు ప్రిపేర్ అయిన విద్యార్థులు 720 మార్కులకు గాను 600 వరకు స్కోర్ చేసి ఉండవచ్చన్నది నిపుణుల అంచనాగ ఉందన్నారు.

# అల్మాస్ పేట అల్లర్ల కుట్రతో మరోసారి బట్టబయలైన వైసీపీ చీకటి రాజకీయం : ప్రత్తిపాటి

రాష్ట్ర అభివృద్ధిని, ప్రజల ప్రశాంతత, సంతోషాన్ని వైసీపీ భరించలేకపోతోంది : ప్రత్తిపాటి

ఎక్కడ, ఏ చిన్న అవకాశం దొరికినా, తమ రాజకీయ ప్రయోజనాలకు దాన్నెలా వాడుకోవాలా అని ఆ పార్టీనేతలు గోతికాడ నక్కల్లా ఎదురుచూస్తున్నారు : ప్రత్తిపాటి

కుట్రలు, కుయుక్తులతో కూటమి ప్రభుత్వంలో లబ్ధి పొందాలనుకోవడం... ఎండమావులతో దాహం తీర్చుకోవడం లాంటిదేనని వైసీపీ గ్రహించాలి : ప్రత్తిపాటి

కాలకేయులు, కాలనాగుల పార్టీ వైసీపీ నుంచి ప్రజల్ని, రాష్ట్రాన్ని ఎలా కాపాడాలో చంద్రబాబుకు బాగా తెలుసు : ప్రత్తిపాటి




చిలకలూరిపేట , పెన్ పవర్, మే 13 : చిలకలూరిపేట : ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవం, ఆలోచనలు, దూరదృష్టితో రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంతోషం.. ప్రశాంతతకు ఎలాంటి లోటూ లేకుండా చేస్తున్నారు. ఆయన సమర్థ నాయకత్వ ప్రతిభను భరించలేకనే వైసీపీ నాయకత్వం రాష్ట్రంలో అల్లర్లు, ఆందోళనలు సృష్టించాలని చూస్తోంది. కడప జిల్లా అల్మాస్ పేట అల్లర్ల కుట్రకోణం సాక్షిగా వైసీపీ చీకటి రాజకీయం మరోసారి బట్టబయలైంది. సున్నిత అంశాన్ని తమ స్వప్రయోజనాలకు వాడుకొని, రెండువర్గాల మధ్య చిచ్చురేపి లబ్ధి పొందాలని చూసిన వారు, శాంతిభద్రతలతో చెలగాటమాడే ప్రయత్నం చేసిన సంఘవిద్రోహులను ఎన్డీయే ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టదు. సమగ్ర విచారణానంతరం ఘటనకు బాధ్యులైనవారిని, వారికి సహకరించిన వారిని చట్టపరంగా, కఠినంగా శిక్షిస్తుంది. కాలకేయులు, కాలనాగుల పార్టీ వైసీపీ నుంచి రాష్ట్రాన్ని, ప్రజల్ని ఎలా కాపాడాలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు బాగా తెలుసు. ప్రజల రక్షణ, రాష్ట్ర పరిరక్షణ విషయంలో ఆయన ఎన్నడూ రాజీ పడరు.

అధికారం కోసం వైసీపీ ఎంతకైనా తెగిస్తుంది అనడానికి పూర్వ కుట్రలే నిదర్శనం

అధికారం కోసం వైసీపీ ఎంతకైనా తెగిస్తుంది అనేందుకు గొడ్డలిపోటు.. కోడికత్తి.. గులకరాయి వంటి పూర్వ కుట్ర రాజకీయాలే ప్రత్యక్ష నిదర్శనం. అధికారం కోసం పితృసమానులైన వారిని మట్టుబెట్టడం, ఆస్తికోసం కన్నపేగును, తోడబుట్టిన బంధాన్ని వేధింపులకు గురిచేయడం, పంపకాల్లో తేడాలొచ్చాయని సొంతపార్టీ వారినే కడతేర్చడాన్ని ప్రజలు చూశారు. హత్యా రాజకీయాలతో, వైసీపీది విడదీయరాని బంధం. గతంలో ఐదేళ్లు విధ్వంసంతో రాష్ట్రాన్నిసర్వనాశనం చేసి, ప్రజల్ని రోడ్లపాలు చేసినా, వైసీపీ నేతల కడుపుమంట చల్లారినట్టు లేదు. రాష్ట్రంలో ఎక్కడ, ఏ చిన్న అవకాశం దొరికినా, తమ రాజకీయ ప్రయోజనాలకు దాన్నెలా వాడుకోవాలా అని ఆ పార్టీనేతలు గోతికాడ నక్కల్లా ఎదురు చూస్తున్నారు. వారి అవినీతి మీడియా కూడా దుష్ప్రచారం తప్ప నిర్భయంగా నిజాలు చెప్పలేని దుస్థితికి దిగజారింది. చివరకు ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తీసుకునే పారదర్శక నిర్ణయాలపై కూడా దుమ్మెత్తిపోయడమే పనిగా పెట్టుకుంది. కూటమిపాలనలో కుట్రలు, కుయుక్తులతో లబ్ధి పొందాలనుకుంటున్న వైసీపీ నేతల ఆశలు.... ఎండమావులతో దాహం తీర్చుకోవడం లాంటివే. అవి ఎప్పటికీ నెరవేరవు.. వారి క్రిమినల్ పాలిటిక్స్ రాష్ట్రంలో పనిచేయవు. ప్రజలు నేరాలు, ఘోరాల పార్టీ అయిన వైసీపీ కుటిల రాజకీయాలపై అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలి." అని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం ఒక ప్రకటనలో సూచించారు.

# గోవిందపురం ఆలయంలో శిలాఫలకం ధ్వంసం





చిలకలూరిపేట , పెన్ పవర్, మే 13 : చిలకలూరిపేట : మండలంలోని గోవిందపురం భీమేశ్వర స్వామి ఆలయంలో శిలాఫలకం ధ్వంసం ఘటన ఉద్రిక్తత దారితీసింది. గర్భగుడిలో శివశంకర్ అనే పేరు గల శిలాఫలకం ఉంచడంపై ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. దీంతో గ్రామస్తులు శిలాపలకాన్ని అక్కడ నుంచి తొలగించారు. ఈ వివాదం పై రెండు వర్గాలు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాయి

.ఫిర్యాదు మేరకు దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

# కనపర్రులో జనాభా గణన: పరిశీలించిన డీఆర్వో

చిలకలూరిపేట , పెన్ పవర్, మే 13 : నాదెండ్ల : మండలంలోని కనపర్రు గ్రామంలో జరుగుతున్న జనాభా గణన ప్రక్రియను జిల్లా రెవెన్యూ అధికారి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ వెళ్తున్న గణన అధికారుల తీరును, వివరాల నమోదు ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రజలందరూ అధికారులకు సహకరించి ఖచ్చితమైన వివరాలను అందించాలని కోరారు. ప్రభుత్వ పథకాల రూపకల్పనకు ఈ గణాంకాలు అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.




01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కాన్వాయ్ వాహనాలను 50% తగ్గించిన పెమ్మసాని...




గుంటూరు, పెన్ పవర్, మే, 13, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలను పాటిస్తూ కాన్వాయ్ వాహనాల తగ్గింపు ఇంధన వినియోగం తగ్గించుకోవడంలో భాగంగా తన వెంట ఉండే అధికారులు, ప్రోటోకాల్ వాహనాలతో పాటు, పలు సొంత వాహనాలను కూడా తగ్గించిన పెమ్మసాని..

# పేటసన్నేగండ్ల గ్రామంలో జరిగిన కొంగర వారి నూతనవస్త్ర, షష్ఠిపూర్తి కార్యక్రమంలో పాల్గొన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి. రామకృష్ణరెడ్డి

కొంగర దంపతులను ఆశీర్వాదించిన పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరి. శంకర్ రావు, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్ భార్గవ్ రెడ్డి





పెన్ పవర్ కారంపూడి మే 13:-- కొంగర వారి నూతన వస్త్ర, షష్ఠిపూర్తి మహోత్సవ కార్యక్రమం బుధవారం పేటసన్నేగండ్ల గ్రామంలోని చప్పిడి. వెంకయ్య కళ్యాణమండపం నందు జరిగింది. ఈ కార్యక్రమంలో మాచర్ల మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు పిన్నెల్లి. రామకృష్ణరెడ్డి, పేటసన్నేగండ్ల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని వస్త్రబహుకరణ ధనుష్‌చౌదరి,యజ్ఞశ్రీలను పిన్నెల్లి. రామకృష్ణరెడ్డి ఆశీర్వాదించారు. అనంతరం కొంగర. సుబ్రహ్మణ్యం ఇందిరాదేవిల షష్ఠిపూర్తి మహోత్సవంలో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఈ సందర్భంగా కొంగర దంపతులను పిన్నెల్లి ఆశీర్వాదించారు. ఇదే కార్యక్రమంలో పెద్దకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరి. శంకర్ రావు, సత్తెనపల్లి వైసీపీ సమన్వయకర్త డాక్టర్ సుధీర్ భార్గవ్ రెడ్డి, పెదకూరపాడు నియోజకవర్గ పరిశీలకులు, గురజాల నియోజకవర్గ వైసీపీ నాయకులు యనుముల. మురళీధర్ రెడ్డి, మాచర్ల నియోజకవర్గ పరిశీలకులు కెవి పాల్గొని చిన్నారులను, కొంగర దంపతులను ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కిశోరి వికాసం పై బాలికలకు అవగాహన సదస్సులు - సూపర్వైజర్ అమృతవాణి



వేమూరు(భట్టిప్రోలు) పెన్ పవర్, మే, 13: కిశోరి వికాసం-వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమాలను నిర్వహించినట్లు వేమూరు సెక్టర్ సూపర్వైజర్ అమృతవాణి తెలిపారు. బుధవారం పెరవలి-4 అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ అమృతవాణి మాట్లాడుతూ బాలికలకు జీవితంలో ఎదురయ్యే పరిస్థితులు వ్యక్తిగత అవసరాలు సమస్యలను గుర్తించటం వాటిని సరైన విధంగా వ్యక్తపరచడం వంటి అంశాలపై అవగాహన కల్పించారన్నారు. విద్య,ఆరోగ్య, పోషకాహారం, కుటుంబాల పద్ధతులు, ఆత్మవిశ్వాసం వంటి అవసరాల ప్రాముఖ్యతను వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు,కిశోరి బాలికలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించండి : ప్రభుత్వ విప్




రైల్వేకోడూరు పెన్ పవర్, మే, 13 తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ అన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పెనగలూరు మండలంలో జిల్లా విద్యాశాఖ అధికారి కేవిఎన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన బడి పిలుస్తుంది కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడి పిలుస్తోంది కార్యక్రమం ద్వారా మన సంకల్పం -విద్యా ప్రగతి' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు విద్యార్థులకు అవగాహన కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాణ్యమైన డిజిటల్ విద్య,ఉచిత పాఠ్య పుస్తకాలు,యూనిఫామ్, మధ్యాహ్న భోజనం తదితర వసతులను కల్పిస్తున్నారని అన్నారు.

అనంతరం పదవ తరగతిలో 2026వ విద్యా సంవత్సరంలో అత్యధిక మార్పులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభా పురస్కార అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి యువనేత ముక్కా సాయి వికాస్ రెడ్డి,తాతంశెట్టి నాగేంద్ర పాల్గొన్నారు.

# "ఆక్వా ఫీడ్ పెంపు పై కాకాణి మండి పాటు"



నెల్లూరు పెన్ పవర్, మే, 13 నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి -ప్రెస్ మీట్ - ముఖ్యమైన అంశాలు.

- కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్రంలో రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారు.
- చంద్రబాబుకు రైతులన్నా, వ్యవసాయమన్నా మొదటి నుంచి నిర్లక్ష్యమే.
- ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల వల్ల ఆక్వా రైతులు రోడ్డున పడుతున్నారు.
- హఠాత్తుగా ఆక్వా ఫీడ్ ధరలు పెంచడం రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.
- టన్నుకు రూ. 8 వేల నుంచి రూ. 10 వేల వరకు ఫీడ్ ధర పెంచడం దారుణం.
- కేజీ ఆక్వా ఫీడ్‌పై ఏకంగా రూ. 8 నుంచి రూ. 10 వరకు భారం పడింది.
- ప్రభుత్వం, ఫీడ్ కంపెనీలు కుమ్మక్కై ఈ ధరల పెంపు నిర్ణయానికి వచ్చాయి.
- ఆక్వా ఫీడ్ తయారీదారులు అందరూ టీడీపీ నేతలు, ఆ పార్టీ సానుభూతిపరులే.
- ఫీడ్ కంపెనీల యజమానులతో కలిసి చంద్రబాబు ప్రభుత్వం రైతుల నడ్డి విరుస్తోంది.
- ఎన్నడూ లేని విధంగా ఆక్వా రైతులను విచ్చలవిడిగా దోచుకుంటున్నారు.
- ఒకవైపు ఫీడ్ ధరలు పెరుగుతుంటే.. మరోవైపు రొయ్యల ధరలు పడిపోతున్నాయి.
- ఏప్రిల్‌లో రూ. 270 ఉన్న వంద కౌంట్ రొయ్యల ధర మే నాటికి రూ. 255కు పడిపోయింది.
- కేవలం ఒక్క నెలలోనే రొయ్యల ధర రూ. 15 మేర తగ్గడం ఆక్వా రైతుకు తీరని నష్టం.
- "ముడుపులు మాకివ్వండి.. ధరలు పెంచుకోండి" అన్నట్టుగా ప్రభుత్వ తీరు ఉంది.
- ఫీడ్ కంపెనీల నుంచి వచ్చే ఆదాయాన్ని టీడీపీ నేతలు పంచుకుంటున్నారని కాకాణి ఆరోపణ.
- ప్రభుత్వం ఉందన్న భయం లేకుండా ఫీడ్ కంపెనీలు ధరలు పెంచుతున్నాయి.
- ఫిబ్రవరిలో కేజీకి రూ. 4 పెంచారు.. ఇప్పుడు మళ్ళీ రూ. 10 వరకు పెంచారు.
- మూడు నెలలు తిరగకుండానే రెండుసార్లు ధరలు పెంచడం ఏ రకమైన పాలన?
- ముడిసరుకులపై దిగుమతి సుంకాలు తగ్గినా.. ఆ ప్రయోజనం రైతుకు దక్కడం లేదు.
- సుంకాలు తగ్గించినప్పుడు ధరలు తగ్గించని కంపెనీలు.. ఇప్పుడు భారీగా పెంచుతున్నాయి.
- ముడిసరుకుల ధరలు పెరగకపోయినా ఫీడ్ రేట్లు పెంచడం వెనుక భారీ కుట్ర ఉంది.
- ఇది ప్రభుత్వ వైఫల్యం కాదు.. ప్రభుత్వం పక్కాగా చేస్తున్న దోపిడీ.
- టీడీపీ కేంద్ర కార్యాలయానికి ఆక్వా ముడుపులు వెళుతున్నాయని కాకాణి విమర్శ.
- ఆక్వా రైతుల కష్టం మొత్తం ఇప్పుడు 'టీడీపీ దోపిడీ' పాలవుతోంది.
- దళారులు, ట్రేడర్ల కంటే టీడీపీ నేతలే రైతులను ఎక్కువగా దోచుకుంటున్నారు.
- వనామీ ఫీడ్ రూ. 12 వేలు, టైగర్ ఫీడ్ రూ. 14 వేలు పెంచుతామని కంపెనీల లేఖ.
- స్టేక్ హోల్డర్లతో మీటింగ్ పెట్టకుండానే ధరల పెంపుపై ఇన్ వాయిస్‌లు విడుదల.
- ఏకపక్షంగా ధరలు పెంచే అధికారం ఫీడ్ కంపెనీలకు ఎవరిచ్చారు?
- ధరల పెంపుపై రైతులు నిరసిస్తుంటే ప్రభుత్వం మౌనంగా ఉండటం సిగ్గుచేటు.
- ఆక్వా రైతుల నిరసన సెగ త్వరలోనే కూటమి ప్రభుత్వానికి తగులుతుందని హెచ్చరిక.

# పాసింజర్ రైలు కింద పడిన గేద గంటపాటు నిలిచిపోయిన రైలు.



వేమూరు( భట్టిప్రోలు) పెన్ పవర్ మే 13: తెనాలి నుంచి రేపల్లె వెళ్లే పాసింజర్ రైలు కింద చినరావూరు జంపని మధ్య రైలు కింద గేద పడటంతో గంటపాటు రైలు నిలిచిపోయింది, వివరాలు ప్రకారం బుధవారం తెనాలి నుంచి రేపల్లె వెళ్లే 67233 పాసింజర్ రైలు సాయంత్రం నాలుగు గంటల 40 నిమిషాలకు తెనాలి నుంచి వస్తుండగా చినరావూరు జంపని మధ్య రైలుకు అడ్డంగా గేదలు వచ్చి రైలు కింద పడ్డాయి రైలు ఇంజిన్ కింద భాగంలో ఇరుక్కుపోవడంతో గేదెల తొలగించేందుకు ఎక్కువ సమయం పట్టింది, దీంతో రైలు గంటపాటు ఆలస్యంగా నడిచింది, ప్రమాదవశాస్తు రైలు కింద పడిన గేదె మృతి చెందినట్లు ప్రయాణికులు తెలిపారు.

## ములుగు జిల్లా కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు తీసుకున్న బోర్థడే హేమంత సహదేవరావు,ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి,పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలియజేసిన, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్,





పెన్ పవర్ మే 13:మే 13,(జిల్లా ములుగు జిల్లా చాలా చిన్న జిల్లా అని, అందులో చాలా వెనకబడిన ప్రాంతం అని కాబట్టి ములుగు జిల్లా అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. బుధవారం అనగా ఈరోజున ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల ములుగు జిల్లాకలెక్టర్,గా నూతనంగాబాధ్యతలు చేపట్టిన బోర్థడే హేమంతసహదేవరావుని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్,మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భముగా పైడాకుల అశోక్, మాట్లాడుతూ ములుగు జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన శుభసందర్భముగా బోర్థడే హేమంత్ సహదేవరావు కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అలాగే ములుగు జిల్లా చాలా వెనుకబడిన గిరిజన ప్రాంతం అని, ములుగు జిల్లా అభివృద్ధికి బాటలు వేయాలని కలెక్టర్ కి సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు,వంగ రవి యాదవ్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి చింతనిప్పుల బిక్షపతి, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె జైపాల్ రెడ్డి, కౌన్సిలర్ పౌడాల ఓం ప్రకాష్, గుంటోజు శంకరయ్య, మాజీ ఎంపీటీసీ రమేష్, బోడ రఘు, జాఫర్, షకీల్, రాజు, విజయ్, రాంబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

# వరి గడ్డి కి భలే గిరాకి



ఆత్మకూరు (అనంతపురం) : పెన్ పవర్ మే 13: ఆత్మకూరు మండలంలో బియలేరు మాదిగుబ్బ మాగాణి కింద సాగు చేస్తున్నారు. మొక్కజొన్న పంటను రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నడంతో పశుగ్రాస కొరత ఏర్పడుతుంది. కొందరు ట్రాక్టర్ యజమానులు,కణేకల్ మాగాణి కింద వరిగడ్డిని కొనుగోలు చేసి గ్రామాల్లోనికి తెచ్చి ట్రాక్టర్ రూ 15 వేలకు అమ్ముతున్నారు. దీంతో పశువుల యజమానులు పశుగ్రాసం కోసం అధిక రేటు పెట్టి వరిగడ్డిని కొనుగోలు చేస్తున్నారు. అధిక విస్తీర్ణంలో వరిని సాగు చేసే సమయంలో రైతులు వరిగడ్డిని ఉచితంగా ఇచ్చేవారు. వరి సాగు తక్కువగా ఉండడంతో వరిగడ్డికి గిరాకీ ఏర్పడడంతో రైతులు ఎకరా వరిగడ్డిని రూ 2500 లకు అమ్ముతున్నారు. ట్రాక్టర్ కు ఎకరాన్నర నుండి రెండు ఎకరాల గడ్డి పడుతుంది. వరిగడ్డికి మంచి డిమాండ్ ఏర్పడిందని రైతులు తెలుపుతున్నారు. ట్రాక్టరు బాడుగ కూలీ ఖర్చులతో ట్రాక్టర్ వరిగడ్డి 13 వేల నుండి 15 వేలకు ధర పలుకుతుందని రైతులు తెలిపారు.

# మహానాడు సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్..!

అతిరథ మహారథులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన కాకర్ల సురేష్..!
నెల్లూరులో మహానాడు ఏర్పాట్లపై విస్తృత సమీక్ష..!
కిసాన్ ఇఫ్కో సెజ్ ప్రాంగణంలో మహానాడు సన్నాహాలు వేగవంతం..!





నెల్లూరు రూరల్ (కొడవలూరు) పెన్ పవర్ మే 13: మే 13 శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం కొడవలూరు మండలం రేగడచెలిక సమీపంలోని కిసాన్ ఇఫ్కో సెజ్ ప్రాంగణంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి సంబంధించిన కమిటీల సమావేశం మరియు సన్నాహక సమీక్ష సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పార్టీ అతిరథ మహారథులతో కలిసి పాల్గొన్నారు. మహానాడు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు, ప్రజా రాకపోకలు, వసతి సదుపాయాలు, భద్రతా చర్యలు, పార్కింగ్ ఏర్పాట్లు, తాగునీరు, విద్యుత్, వేదిక నిర్మాణం, కార్యకర్తల సమన్వయం వంటి పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. రాష్ట్ర నలుమూలల నుండి భారీ సంఖ్యలో తరలిరానున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, మహానాడు కేవలం పార్టీ కార్యక్రమం మాత్రమే కాకుండా తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి సంకల్పం మరియు ప్రజా ఆశయాలకు ప్రతీకగా నిలిచే మహోత్సవమని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో పాల్గొన్న సీనియర్ నాయకులు, పార్టీ బాధ్యులు తమ అనుభవాలను పంచుకొని పలు సూచనలు, సలహాలు అందించగా, వాటిని ఎమ్మెల్యే శ్రద్ధగా వినిపించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని ఏర్పాట్లు మరింత మెరుగ్గా చేపట్టాలని సూచించారు. మహానాడు కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయంగా నిలపాలని నాయకులు, కార్యకర్తలు సంకల్పం వ్యక్తం చేశారు.

# సూరేపల్లి లో ప్రకృతి వ్యవసాయం పై శిక్షణ కార్యకమం.






భట్టిప్రోలు పెన్ పవర్ మే 13:పలనాడు జ్యోతి: మండలంలోని సూరేపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి బి బ్రహ్మారెడ్డి అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యకమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మధు మోహన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎం మధుమోహన్ మాట్లాడుతూ,ప్రతీ ఒక్కరూ రసాయన ఎరువుల,పురుగు మందుల వాడకం క్రమంగా తగ్గించుకుంటూ పూర్తిగా ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని కోరారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా లాభాలు ఆర్జించ వచ్చని,దానికి నిబద్ధత మరియు ప్రకృతి పట్ల విచక్షణ ఉండాలని అన్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల అంచనా ప్రకారం ఎల్ నినో ప్రభావం కారణం చేత ఈ సంవత్సరం వర్షాలు ఆలస్యంగా కురుస్తాయి కావున ప్రతీ రైతూ ఈ సమయంలో వారి పొలాల్లో పీఎండి యస్ కిట్లు వేసుకుని సాగు చేయటం ద్వారా నేల సారవంతం అవుతుందని, తదుపరి వేసే ప్రధాన పంట సమయంలో ఎరువుల వినియోగం గణనీయంగా తగ్గించ వచ్చునని సూచించారు.ప్రకృతి వ్యవసాయం చేస్తూ లాభాలని ఆర్జిస్తున్న రైతుల అనుభవాల్ని వివరించారు. తదుపరి మండల వ్యవసాయ అధికారి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ , రానున్న కాలంలో ప్రకృతి వ్యవసాయం ఎక్కువగా అవలంబిస్తారన్నారు. వినియోగ దారుల మార్కెట్ లో ప్రకృతి వ్యవసాయం లో పండించిన పంటలకు బాగా డిమాండ్ ఉన్నదని,ఇటువంటి పద్దతుల్లో వ్యవసాయం చేసి ప్రతీ రైతూ లాభం పొందాలని సూచించారు.

పెదపులివర్రు లో..

పెదపులివర్రు గ్రామంలోని ఏటీఎం మోడల్ పొలాన్ని సందర్శించటం జరిగింది.ప్రకృతి వ్యవసాయం అవలంబించే రైతులు,ద్రవ జీవామృతం,బీజమృతం తయారీ పద్దతులను,పద్దతి ప్రదర్శన ద్వారా క్షేత్రంలోనే తయారు చేసి చూపించటం జరిగింది ఈ కార్యక్రమంలో ఏఇఓ లు, వివిఎలు,ఏపీ సీ ఎయన్ ఎఫ్ మాస్టర్ ట్రైనర్,మండల కోఆర్డినేటర్,సిబ్బంది పాల్గొన్నారు.

# వధువును ఆశీర్వదించిన ఎంపీపీ వెంకటకృష్ణప్రసాద్





నెల్లూరు పెన్ పవర్ మే 13: మండలంలోని ఉత్తర వడ్డిపాలెం గ్రామంలో బుధవారం సందడి నెలకొంది. గ్రామానికి చెందిన చల్లా బాలవేణు, సులోచన దంపతుల కుమార్తె వైష్ణవి వివాహ వేడుకల్లో భాగంగా నిర్వహించిన నలుగు కార్యక్రమానికి దగదర్తి మండలాధ్యక్షులు (ఎంపీపీ) తాళ్లూరి వెంకటకృష్ణప్రసాద్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వధువును ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఐ వి ఎఫ్ జగ్గయ్యపేటవారి ఆధ్వర్యంలో చలివేంద్రంలో భాగంగా 43వ రోజు మజ్జిగ. సబ్జానీళ్లు పంపిణిచేసిన మహిళా ఎల్ ఐ సి ఏజెంట్ కాకరపర్తి జ్యోతి




జగ్గయ్యపేట పెన్ పవర్ మే 13: ఐ.వి.ఎఫ్. జగ్గయ్యపేట పట్టణ మహిళా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈరోజు జై ని కృష్ణమూర్తి,అరుణమ్మ జ్ఞాపకార్థం, వారి కుమార్తె రాచర్ల పద్మజ, పద్మజా స్నేహితుల సహకారంతో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వంగేటి కోటేశ్వరరావు(పాలన్నాడు జిల్లా అమరావతి)చెందిన జన్మదిన సందర్భంగా సబ్జానీళ్లు పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎల్.ఐ.సి మహిళా ఏజెంట్ కాకరపర్తి నాగ వెంకట శివ జ్యోతి చేతుల మీదగా పంపిణి చేశారు. ఈ కార్యక్రమం లో ఐ.వి.ఎఫ్ పట్టణ ప్రెసిడెంట్ వీర వల్లి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ స్వామి కృష్ణ, రాయపూడి రమేష్,కాకరపర్తి దినిష్ వెంకట్ కార్తీక్, మహిళా విభాగం ప్రెసెసిడెంట్ వీరవల్లి పద్మావతి, నాగలక్ష్మి,కాకరపర్తి నాగ వెంకట శివ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మలపెంటలో సీఎం పర్యటన.. పరిశీలించిన ఎంపీ,ఎమ్మెల్యే..

- సభ ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేసిన...కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి





నెల్లూరు పెన్ పవర్ మే 13: నెల్లూరు జిల్లా, కావలి నియోజకవర్గంలో ఈ నెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. కావలి మండలం తుమ్మలపెంటలో నిర్వహించనున్న "మత్స్యకారుల భరోసా" భారీ సభలో సీఎం పాల్గొని మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే వేగవంతంగా కొనసాగుతున్నాయి. సభను విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో విస్తృత స్థాయిలో చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో తుమ్మలపెంటలో సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలు, ప్రజల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లను నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి కలిసి పరిశీలించారు. సభకు భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రతి అంశాన్ని సమగ్రంగా పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా మత్స్యకారులు పెద్ద ఎత్తున హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.సభా ప్రాంగణం పరిశీలన సందర్భంగా కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. తుమ్మలపెంటలో జరగనున్న ఈ సభ మత్స్యకారుల జీవితాల్లో మరింత నమ్మకం కలిగించే కార్యక్రమంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సభా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. హెలిప్యాడ్ ప్రాంతంలో భద్రతా చర్యలు కట్టుదిట్టంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని తెలిపారు. సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నందున నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేయడానికి తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఇప్పటికే గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలను ఆహ్వానిస్తున్నాయి. తుమ్మలపెంటలో జరగనున్న "మత్స్యకారుల భరోసా" సభ రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకోనుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో అధికారులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు..

# గుండెపోటుతో టిడిపి నేత గంగరాజు మృతి

పెద్దారవీడు : పెన్ పవర్ మే 13: తెలుగుదేశం పార్టీ కీలక నేత గుమ్మ గంగరాజు (48) గురువారం ఉదయం 6:30 గంటల సమయంలో గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో మృతి చెందారు. మూడు రోజుల క్రితం గుండెపోటుతో ప్రైవేటు వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరారు. వైద్య సేవలు పొందిన ప్రయోజనం లేకపోయింది. గంగరాజు భార్య ఇందిరా ప్రియదర్శిని కాంగ్రెస్ పార్టీ తరఫున మండల జడ్పీటిసిగా పనిచేశారు. గంగరాజు అప్పట్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా పని చేశారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆ పార్టీల కీలక నేతగా ఎదిగారు. జిల్లా కమిటీ కో కన్వీనర్ గా వ్యవహరిస్తున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిశీలకులుగా టిడిపి అధిష్టానం బాధ్యతలు అప్పగించింది. గుమ్మా గంగరాజు స్వగ్రామం పెద్దారవీడు మండలంలోని దేవరాజు గట్టు. అదే గ్రామంలో ఇందిరా ప్రియదర్శిని విద్యాసంస్థలను నెలకొల్పాడు. బీఈడీ, డి ఈ డి, డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నాడు. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ గూడూరి ఎరీక్షన్ బాబు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

# శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం, జొన్నవాడ క్షేత్రం

## శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా బ్రహ్మోత్సవాలు - తెప్పోత్సవం ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు





బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మే 13. శ్రీవార్ల వార్షిక బ్రహ్మోత్సవాలలో అత్యంత వైభవంగా నిర్వహించబడే తెప్పోత్సవం కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను దేవస్థాన అధికారులు స్వయంగా పరిశీలించారు. కార్యక్రమం నిర్వహించనున్న పుష్కరిణి పరిసర ప్రాంతాలను సందర్శించి జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. తెప్పోత్సవం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇసుక సమతలీకరణ, నీటి మట్టం పరిశీలన, రాకపోకల మార్గాలు, విద్యుత్ వెలుగులు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.పుష్కరిణి వద్ద యంత్రాల సహాయంతో జరుగుతున్న శుభ్రపరిచే పనులు, ఇసుక తొలగింపు మరియు వేదికల ఏర్పాట్లను ఆలయ అధికారులు పరిశీలించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే వేలాది మంది భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేపడుతున్నట్లు తెలిపారు.అదేవిధంగా భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన చోట బ్యారికేడ్లు, లైటింగ్ మరియు తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని సంబంధిత విభాగాలకు సూచించారు. తిరుమూరు అశోక్ రెడ్డి చైర్మన్ మరియు ధర్మకర్త మండల సభ్యులు అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి

# టిడిపి నాయకుడును పరామర్శించిన- ఎమ్మెల్యే విజయశ్రీ...





పెళ్లకూరు,పెన్ పవర్, మే 13 పెళ్లకూరు మండలంలోని రావులపాడు గ్రామానికి చెందిన చిల్లకూరు సొసైటీ అధ్యక్షుడు కె.వి నాయుడు తండ్రికొచ్చర్ల.వెంకమనాయుడు ఇటీవల మృతి చెందగా ఆయన కర్మ క్రియలు బుధవారం వారి స్వగృహం నందు జరిగినవి ఈ కార్యక్రమానికి సూళ్లూరుపేట శాసనసభ్యురాలు నెలవల. విజయశ్రీ పాల్గొని వెంకమ నాయుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించడం జరిగినది, అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి భగవంతుడు మీకు ఆయన లేని లోటును తీరుస్తారని కుటుంబ సభ్యులందరూ మనోధర్యంతో ఉండాలని సూచించడం జరిగినది,

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, మండల టిడిపి నాయకులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

# తాల్వాయిపాడు లో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం..





పెళ్లకూరు, పెన్ పవర్, మే 13 పెల్లకూరు మండలంలోని తాల్వాయిపాడు గ్రామంలో బుధవారం శివాలయ ప్రాంగణంలో నవగ్రహ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగినది, మంగళవారం శాస్త్రోత్మకంగా ప్రారంభమైన విగ్రహ పూజ మహోత్సవం వేద బ్రాహ్మణ పండితులచే హోమాలు, అభిషేకాల నిర్వహణ అనంతరం మంగళ వాయిద్యములతో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించడం జరిగినది, ఈ కార్యక్రమంలో గ్రామంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొ స్వామి అమ్మవార్ల పూజ నిర్వహించి నవగ్రహాలకు అభిషేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి సూళ్లూరుపేట శాసన సభ్యురాలు నెలవల. విజయశ్రీ, దంపతులు, మండల అధ్యక్షులు సంచి. కృష్ణయ్య, ఎక్స్ మిల్ట్రీ రమణయ్య, సిద్దిల్ నాయుడు, మదన్మోహన్ నాయుడు, మరి కొంతమంది నాయకులు గుడి కార్యక్రమాల్లో పాల్గొనగా

వీరికి తాల్వాయిపాడు టిడిపి నాయకులు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కిలారి.గోపి, కే బాలయ్య, జి శ్రీనివాసులు,భాస్కరయ్య, కే వెంకటా చలపతి కే శ్రీనివాసులు, మరి కొంతమంది నాయకులు ఆలయం వద్ద స్వామి వారిచే అర్చన కార్యక్రమాలు నిర్వహించి అనంతరం ఎమ్మెల్యే దంపతులకు శాలువాలు కప్పి సత్కరించి తీర్థప్రసాదాలు అందించడం జరిగినది.

# ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే దేవ..





సఖినేటిపల్లి పెన్ పవర్, మే, 13 రాజోలు నియోజకవర్గ పరిధిలోని చింతలమోరి, మెండుపాలెం, కేశవదాసుపాలెం, అంతర్వేది ప్రాంతాలలో ప్రతిపాదిత లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలపై రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ముంపు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ శృంగవరప్పాడు నుండి అంతర్వేది వరకు విస్తరించిన తీర ప్రాంతాల్లో ప్రతి ఏడాది ముంపు సమస్య తీవ్రరూపం దాల్చుతోందని తెలిపారు. వర్షపు నీరు, ముంపు నీరు బయటకు వెళ్లేందుకు సరైన వ్యవస్థ లేకపోవడం వల్ల వేల ఎకరాల పంట పొలాలు నీట మునిగి పోతున్నాయని, గ్రామాల్లో ఇళ్ల చుట్టూ కూడా నీరు నిలిచిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో తాను స్వయంగా ఈ ప్రాంతాలను సందర్శించి, ప్రజల సమస్యలను పరిశీలించానని, ప్రస్తుతం పరిస్థితి మరింత ఆందోళనకరం గా మారుతోందని చెప్పారు. ఇప్పటికే సుమారు 3000 ఎకరాల పంట భూములు ముంపు కారణంగా నష్టపోయాయని, భవిష్యత్తులో సరైన చర్యలు తీసుకోకపోతే సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశముందని హెచ్చరించారు. ఒక సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా మెండుపాలెం ప్రాంతంలో ప్రత్యేక రెగ్యులేటర్ ఏర్పాటు చేసి, భారీ సామర్థ్యమున్న మోటార్ల ద్వారా ముంపు నీటిని సముద్రంలోకి పంపించే విధంగా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. దీనివల్ల ముంపు నీరు త్వరితగతిన బయటకు వెళ్లే అవకాశం ఉండి రైతులకు, గ్రామ ప్రజలకు భారీ ఊరట లభిస్తుందని తెలిపారు. సముద్రతీర ప్రాంతాలకు చెందిన 13 గ్రామాలలో చప్పనీరు సక్రమంగా ప్రవహించే విధంగా కొత్త కాలువల నిర్మాణం చేపట్టడం తన తదుపరి లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు.

# హనుమాన్ జయంతి వేడుకల్లో రెండో రోజు భజన కార్యక్రమం

## భక్తి పరవశంలో గంగవరం



గంగవరం, పెన్ పవర్ మే 13 : హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా రెండోరోజు బుధవారంగంగవరం గ్రామంలోభక్తి శ్రద్ధలతో ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు.

అడ్డతీగల భజన బృందం ఆదినారాయణ, నాని, వాసు ఆధ్వర్యంలో, భక్తి మండలి పట్నాయక్ మాస్టారు, ప్రసాద్ తదితరులు కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో సాగిన ఈ భజన కార్యక్రమంలో హనుమాన్ స్తోత్రాలు, భక్తి గీతాలు ఆలపించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. గ్రామ ప్రజలు, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..

# మహానాడును ఘనంగా నిర్వహించాలి



నెల్లూరు: పెన్ పవర్ మే 13: టిడిపి మహానాడును అట్టహాసంగా నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతోపాటు మంత్రులు, పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు నిర్ణయించారు. బుధవారం నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రేగడ చిలక కిసాన్ సెజ్‌లో తొలిసారి మహానాడు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఉదయం పది గంటలకు ప్రారంభమైన సమావేశం సాయంత్రం వరకు కొనసాగింది. మహానాడు కన్వీనర్లు, కో-కన్వీనర్లు, సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశ మందిరంలో మహానాడు కోసం ఇప్పటి వరకు జరిగిన ఏర్పాట్లు, మహానాడు ఎలా నిర్వహించాలి, భోజనం, ప్రచారం, మహానాడు వేదిక నిర్వాహణ, తీర్మానాల కమిటీ, ప్రతినిధుల నమోదు కమిటీ, మీడియా, బహిరంగ సభ ఏర్పాట్లు, జన సమీకరణ, వసతి, వంటి కీలక విషయాలపై సమావేశంలో చర్చించారు. 27, 28న సుమారు 20 వేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారని, 29 న జరిగే బహిరంగ సభకు సుమారు ఏడు లక్షల మంది హాజరు అవుతారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

# ఎల్ ఓ సి ద్వారా క్యాన్సర్ బాధితుడి కి చేయూత అందించిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి





నెల్లూరు రూరల్ పెన్ పవర్, మే, 13 మే 13 శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం దగదర్తి మండలం దగదర్తి గ్రామం లో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా దగదర్తి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు వింజం సుబ్బయ్య నాయుడు కి ఎల్ఓసి ద్వారా ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఇటీవల అనారోగ్యంతో గుంటూరులోని కిమ్స్ చక్ర క్యాన్సర్ సెంటర్ నందు ఆయన చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న దగదర్తి మండల తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాలేపాటి రవీంద్ర నాయుడు మరియు దగదర్తి మండల టిడిపి యువ నాయకులు మాలేపాటి లోకేష్ ల సూచనలతో ప్రతిపాదనలు పంపగా అత్యవసర శస్త్రచికిత్స ఖర్చుల నిమిత్తం 5 లక్షల 9000 వేలు రూపాయలు ను ఎల్ ఓ సి ద్వారా మంజూరు చేసి అందించడం జరిగింది. పార్లమెంటు సభ్యులు నెల్లూరు ఎం పీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వింజం సుబ్బయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు వి.పి.ఆర్ కి మరియు మాలేపాటి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు

# 2027 నాటికి పోలవరం పూర్తి

**ఏలూరు, మే 13, పెన్ పవర్:**
పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పై కీలక అప్డేట్ వచ్చింది. మంత్రి నిమ్మల రామానాయుడు కీలక ప్రకటన చేశారు. 2027 జూన్ నాటికి ప్రాజెక్టు పూర్తవుతుందని.. అదే నెలలో ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబు కేంద్ర జల శక్తి మంత్రి సిఆర్ పాటిల్ ను కలిసిన తరువాత మంత్రి రామానాయుడు ప్రకటన చేయడం విశేషం. ఆంధ్రప్రదేశ్కు జీవనాడిగా పోలవరం ప్రాజెక్టును భావిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో నత్తనడకన పనులు సాగాయి. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు వేగవంతం అయ్యాయి. ఏడాది కాలంలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది పోలవరం. ఎప్పటికప్పుడు మంత్రి నిమ్మల రామానాయుడు పర్యవేక్షిస్తున్నారు. సీఎం చంద్రబాబు సైతం నిత్య పరిశీలనలతో పాటు సమీక్షలు నిర్వహిస్తూ పనులను వేగవంతం చేయిస్తున్నారు. ఏడాది కాలంలో ఈ ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది అని తెలుస్తుండడం మాత్రం శుభ పరిణామం.గోదావరి, కృష్ణా నదులను అనుసంధానిస్తూ ఏలూరు జిల్లా పోలవరం సమీపంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. వైయస్ రాజశేఖర్ రెడ్డి ఈ ప్రాజెక్టు పనులను ప్రారంభించారు. అయితే 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించింది. ప్రారంభంలో రామ పాద సాగర్ గా పిలవబడిన ఈ పథకాన్ని పోలవరం ప్రాజెక్టు గా మార్చారు. 2004లో అధికారంలోకి వచ్చిన రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నదీ ప్రవాహానికి కుడివైపున ఒక స్పిల్ వే నిర్మించారు. ఈ స్టిల్ వేకు అడ్డంగా 48 గేట్లతో ఒక బ్యారేజీ నిర్మాణం చేపడుతున్నారు. నదీ ప్రధాన ప్రవాహానికి అడ్డంగా ఆనకట్ట నిర్మించి.. ఆ ప్రవాహాన్ని కుడివైపున ఉన్న స్కిల్ వేలోకి మళ్ళిస్తారు. ఈ ప్రాజెక్టుకు గేట్లు ఉండవు. కేవలం రాక్ ఫీల్డ్ డ్యామ్ మాత్రమే ఉంటుంది. అయితే ఈ ప్రాజెక్టులో 1118 మీటర్ల పొడవు ఉండే స్పిల్ వే ప్రత్యేకమైనది.దాదాపు 22 సంవత్సరాల కిందట పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. కానీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత మాత్రమే ఈ ప్రాజెక్టుకు గుర్తింపు లభించింది. 2015లో జాతీయ ప్రాజెక్టుగా గుర్తించారు. పోలవరం జాప్యం జరగడంతో పట్టిసీమను తెరపైకి తెచ్చారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. 2015 లోనే దాదాపు 1300 కోట్లు ఖర్చు పెట్టి తొలి విడతగా పూర్తి చేశారు. అయితే మరో ఏడాది కాలంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేసి... ప్రాజెక్టును జాతికి అంకితం చేయాలని భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా పనులు చేయిస్తున్నారు. మరో ఏడాదిలో పోలవరం ప్రాజెక్టు అందుబాటులోకి వస్తుండడం మాత్రం నిజంగా శుభ పరిణామం.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## సినిమాల్లో ఆ ఒక్క మార్పు చేయండి.. మంత్రి దుర్గేశ్ రిక్వెస్ట్

**విజయవాడ, మే 13, పెన్ పవర్:** సినీ దర్శకులకు ఏపీ మంత్రి దుర్గేశ్ కీలక సూచన చేశారు. తమ సలహా పాటించే వారికి అవసరమైన సహకారం అందజేస్తామని ఆఫర్ చేశారు. ఇంతకీ మంత్రి చేసిన సూచన ఏంటంటే.. ఇకపై తెలుగు సినిమాల్లో షూటింగ్ లోకేషన్ పేర్లను కూడా తెరపై ప్రదర్శించాలని, అలా చేయడం వల్ల ఏపీలో అందమైన లొకేషన్లపై ప్రజలకు సమాచారం ఇవ్వడంతోపాటు టూరిజం అభివృద్ధి, స్థానిక యువతకు ఉపాధి కల్పన జరుగుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఏపీ పర్యాటక రంగం అభివృద్ధికి సినిమా పరిశ్రమ ఒక శక్తివంతమైన సాధనంగా మారాలని మంత్రి కందుల దుర్గేశ్ కోరారు.

రాష్ట్రంలోని అందమైన లొకేషన్లను ప్రపంచానికి పరిచయం చేయడంలో దర్శకులు కీలక పాత్ర పోషించాలని మంత్రి దుర్గేశ్ ఆకాంక్షించారు. సాధారణంగా సినిమాల్లో అందమైన ప్రదేశాలను చూసినప్పుడు ప్రేక్షకులు అవి ఎక్కడ ఉన్నాయో? తెలుసుకోడానికి ఆసక్తి చూపుతుంటారు. ఈ క్రమంలోనే మంత్రి దుర్గేశ్ చిత్ర దర్శకులకు ఒక సరికొత్త సూచన చేశారు. సినిమాలో ఏదైనా సీన్ వస్తున్నప్పుడు, ఆ షూటింగ్ జరిగిన ప్రాంతం పేరును తెరపై ప్రదర్శించాలని కోరారు. దీనివల్ల ఆయా ప్రాంతాలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

**చిన్న మార్పు పెద్ద ప్రయోజనం!**

మంత్రి సూచనలతో సినీ దర్శకులు చేసే చిన్నమార్పు వల్ల మంచి ప్రయోజనాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధానంగా ఏపీలో చాలా ప్రాంతాలు సినిమా షూటింగులకు అనుకూలంగా ఉంటుంది. వైజాగ్, అరకు, కోనసీమ ప్రాంతం, మారేడుమిల్లి, శేషాచలం అడవులలో ఎక్కువగా షూటింగులు జరుగుతుంటాయి. అయితే ఇప్పటివరకు ఆయా ప్రాంతాల అందాలను తెరపై చూసి ఆనందించడమే కానీ, ప్రేక్షకులు వాటి వివరాలను తెలుసుకోలేకపోయేవారు. కానీ, మంత్రి సూచన అమలు చేస్తే సినిమా చిత్రీకరించిన ప్రాంతం ఎక్కడ ఉందో ప్రేక్షకులు తెలుస్తుంది. దీంతో వారు ఆ ప్రాంతాన్ని సందర్శిస్తే పర్యాటక అభివృద్ధి జరుగుతుందని, తద్వారా స్థానికులకు ఉపాధి కలుగుతుందని అంటున్నారు.

**అలా చేస్తే సహకారం**

ఆంధ్రప్రదేశ్లో షూటింగ్స్ జరుపుకునే చిత్రాలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని, దర్శకులు తమ సినిమాల్లో ఏపీ లొకేషన్లకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి కోరారు. కేవలం అందమైన విజువల్స్ మాత్రమే కాకుండా, అవి ఏ ప్రాంతానికి చెందినవో చెప్పడం ద్వారా ఆ ప్రదేశాల అభివృద్ధికి దర్శకులు తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. మంత్రి చేసిన ఈ వినూత్న ప్రతిపాదనపై సినీ రంగం ఎలా స్పందిస్తుందో చూడాలి. ఒకవేళ ఇది అమలైతే, భవిష్యత్తులో మన ఏపీలోని కోనసీమ అందాలు, అరకు లోయలు, రాయలసీమ కోటలు వెండితెరపై మరింత స్పష్టంగా ప్రపంచానికి పరిచయం కావడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## తిరుమలలో డిజిటల్ దొంగలు.. సర్కారుకు బ్యాడ్ నేమ్!

**విజయవాడ, మే 13, పెన్ పవర్:** తిరుమల పవిత్ర క్షేత్రాన్ని దర్శించుకుని.. ఏడుకొండలవాడి దర్శనం కోసం తపించి పోయే.. భక్తుల వీక్ నెస్ను కొందరు దొంగలు.. తమకు లాభార్జనగా మార్చుకుంటున్నారు. ఈ క్రమంలోనే తిరుమల శ్రీవారి దర్శన టోకెన్లను ముందుగానే బుక్ చేసుకుని.. వాటిని దొడ్డిదారిలో విక్రయిస్తున్నారు. ఒకరకంగా.. ఇది తిరుమల డిజిటల్ దొంగలకు ఆవాసంగా మారిందన్న సంకేతాలను ఇస్తోంది.

**ఏం చేస్తారు?**

తిరుమలలో శ్రీవారిని దర్శించుకునేందుకు వివిధ రకాల టికెట్లు అందుబాటులో ఉంటున్నాయి. నెలకు ఒకసారి ఆర్జిత సేవా టికెట్లను ఆన్లైన్లో విడుదల చేస్తారు. వీటితో పాటు.. ప్రతి రోజూ ప్రస్తుతం అత్యంత ఖరీదైన రూ.10 వేల టికెట్లను -శ్రీవాణి- రూపంలో తిరుమల అధికారులు.. ఆన్లైన్లో విడుదల చేస్తున్నారు. రోజుకు ఉండే రద్దీని దృష్టిలో పెట్టుకుని.. ఈ టికెట్లను 800 వరకు విడుదల చేస్తారు. ఈ టికెట్ తీసుకున్న వారి కుటుంబంలోని ఐదుగురు వరకు శ్రీవారిని దర్శించుకునే అవకాశం ఉంటుంది.

దీంతో ఈ టికెట్ల కోసం భక్తుల్లోనూ డిమాండ్ ఎక్కువగా ఉంది. దీనిని ఆసరా చేసుకున్న డిజిటల్ దొంగలు.. టికెట్లను ఆన్లైన్లో విడుదల చేయడానికి ముందుగానే.. తాము ముందుగానే కుదుర్చుకున్న బేరం ప్రకారం.. భక్తుల నుంచి వివరాలు సేకరించి.. 'ఆటోఫిల్లింగ్' యాప్ ద్వారా ఆయా వివరాలను సిద్ధం చేసుకుంటారు. అంతేకాదు.. వాస్తవానికి ఆన్లైన్ ఈ టికెట్లను విడుదల చేయడానికి 10 నిమిషాల ముందుగానే వీరు టికెట్లను బుక్ చేసుకుని ఒక్కొక్క టికెట్పై 3 నుంచి 5 వేల రూపాయలను గడిస్తున్నారు. దీంతో సాధారణ భక్తులకు ఈ టికెట్లు లభించడం లేదు.

**ఎవరి సహకారం?**

తిరుమలలో గత కొన్నాళ్లుగా ఈ వ్యవహారం నిరాఘాటంగా సాగిపోతోంది. దీని వెనుక పెద్ద తలకాయలనే ఉన్నాయని.. రోజుకు 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు దొడ్డిదారిలో సంపాయించుకుంటున్నారని.. విజిలెన్స్ అధికారులు లెక్కలు తీశారు. దీనిని అరికట్టేందుకు పెద్ద ఎత్తున విచారణ జరగాల్సి ఉందని చెబుతున్నారు. ఆలయంలో రెండో, మూడో గ్రేడ్ అధికారుల ప్రమేయంతోనే ఇదంతా జరుగుతున్నట్టు చెబుతున్నారు. మొత్తంగా ఆలయ అధికారులు, సిబ్బంది కుమ్మక్కయి.. ఈ దొడ్డిదారి వ్యాపారం చేస్తూ.. ఆలయ పవిత్రతను దెబ్బతీస్తున్నారని అధికారులు ప్రభుత్వానికి తెలియజేశారు.

## సినీ హీరోలను వాడేసుకుంటున్న ఫ్యాన్

**విజయవాడ, మే 13, పెన్ పవర్: :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చాలా విచిత్రంగా ఉంటాయి. వ్యూహాత్మకంగా కూడా ఉంటాయి. ముఖ్యంగా సోషల్ మీడియా ద్వారా చేసే ప్రయత్నాలు బాగా ఆకట్టుకుంటాయి. ప్రధానంగా సినీ హీరోల అభిమానులను తన వైపునకు తిప్పుకునే ప్రయత్నంలో వైసిపి చేసే రాజకీయం మామూలుగా ఉండదు. ప్రస్తుతం టాలీవుడ్ ప్రముఖ హీరోల అభిమానులను వారికి తెలియకుండానే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ టర్న్ చేసుకోగలదు. అంత గొప్ప వ్యూహం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సొంతం. టిడిపి కూటమికి సినీ గ్లామర్ ఉంది. నందమూరి తో పాటు ఇతర సినీ పెద్దల అభిమానం ఉంది. జనసేనకు మెగా కాంపౌండ్ వాల్ నుంచి బలమైన సపోర్ట్ లభిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మాత్రం ఆ స్థాయిలో లేదు. అందుకే ప్రముఖ హీరోల అభిమానులను వైసీపీ వైపు తిప్పుకునేందుకు సోషల్ మీడియాలో పెద్ద ప్రయత్నమే చేసింది. ఆ హీరోలంతా జగన్మోహన్ రెడ్డికి అభిమానులు అన్నట్టు సోషల్ మీడియాలో బిల్డప్ ఇస్తోంది.యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ విషయంలో అటువంటి ప్రచారమే చేసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఇప్పటికీ చేస్తూనే ఉంది. ప్రభాస్ పెదనాన్న రెబల్ స్టార్ కృష్ణంరాజు. ఆయన బిజెపిలో ఉండేవారు. బిజెపి నేతగానే చనిపోయారు. ఒకానొక దశలో కృష్ణం రాజు జనసేనలో చేరుతారని అప్పట్లో ప్రచారం నడిచింది. అయితే ఆయన అకాల మృతి చెందారు. ఆ సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. కృష్ణంరాజు స్వగ్రామంలో పెద్ద కర్మ నిర్వహించారు. ఆ సమయంలో అయితే రాజశేఖర్ రెడ్డి పై కృష్ణంరాజుకు ఎంతో అభిమానం ఉండేదన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ చేశారు. సహజంగానే రాజకీయ సినీ రంగాలకు దగ్గర సంబంధాలు ఉంటాయి. అప్పట్లో కృష్ణంరాజును రాజా అని రాజశేఖర్ రెడ్డి సంబోధించేవారని స్వయంగా రెబల్ స్టార్ ప్రకటించారు. దానిని పట్టుకొని యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ తమ వాడే అన్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అయితే దీనిని గుర్తించిన కృష్ణంరాజు భార్య ఏకంగా కూటమికి మద్దతు ప్రకటించడంతోపాటు ప్రచారం చేశారు. అయినా సరే ఇప్పటికీ ప్రభాస్ అభిమానులను వైసీపీ వైపు తిప్పుకోవడానికి ఆ పార్టీ చేయని ప్రయత్నం అంటూ లేదు.మరోవైపు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులను సైతం వైసీపీ నిత్యం ఆకర్షిస్తూనే ఉంటుంది. నందమూరి, నారా ఫ్యామిలీలతో జూనియర్ ఎన్టీఆర్ కు గ్యాప్ ఉందంటూ ప్రచారం చేయడంలో వైయస్సార్ కాంగ్రెస్ సోషల్ మీడియా ముందుంటుంది. మంత్రి నారా లోకేష్ కోసం జూనియర్ ఎన్టీఆర్ ను పార్టీలో తొక్కేశారు అంటూ ప్రచారం చేయడంలో కూడా వైయస్సార్ కాంగ్రెస్ పాత్ర ఉంది. సినిమాలే ప్రపంచం గా బతుకుతున్నారు జూనియర్ ఎన్టీఆర్. రాజకీయాల గురించి పట్టించుకునే స్థాయిలో లేరు ఆయన. అయితే అయిన దానికి కానీ దానికి ఫ్యాన్స్ మధ్య విభజన రేఖ గీసి.. వారిని తమ వైపు తిప్పుకునే పనిలో ఉంటుంది వైయస్సార్ కాంగ్రెస్. ఎప్పటికప్పుడు చంద్రబాబుతో పాటు లోకేష్ కు చెక్ పెట్టాలని జూనియర్ ఎన్టీఆర్ పేరును తెరపైకి తీసుకొస్తూ వివాదాలు సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

## గవర్నమెంట్ లోనూ వర్క్ ఫ్రం హోమ్.. చంద్రబాబు కీలక ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ప్రధాని మోదీ సూచనల మేరకు దేశ ప్రజలు అంతా పొదుపు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చిన సీఎం చంద్రబాబు వర్క్ ఫ్రం హోంపై ఆసక్తికర ప్రకటన చేశారు. వర్క్ ఫ్రం హోం అనేది రియాలిటీ. ప్రపంచం మొత్తం ఇంటి నుంచే పనిచేసే పరిస్థితి వస్తుంది. దీనిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వివరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల్లోనే తన ప్రభుత్వం కీలక ప్రకటన చేయనుందని వెల్లడించారు. అమరావతిలోని బొల్లినేని మెడికల్ సైన్స్ అండ్ స్కిల్ సెంటర్ కు శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని మోదీ చెప్పిన 8 పొదుపు చర్యలను పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



గల్ఫ్ యుద్ధం, చమురు సంక్షోభం నేపథ్యంలో పొదుపు మంత్రాన్ని పాటించాలని ప్రధాని మోదీ రెండు రోజుల క్రితం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. డీజిల్, పెట్రోల్ వినియోగం తగ్గించడంతోపాటు వంట గ్యాస్, వంట నూనెల వినియోగంపై ప్రధాని కీలక సూచనలు చేశారు. బంగారం కొనుగోలు నిర్ణయాన్ని ఏడాది పాటు వాయిదా వేసుకోవాలని సూచించారు. దీనిపై తాజాగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలు అంతా దేశం కోసం బాధ్యత వహించాలని, ప్రధాని పిలుపునిచ్చిన పొదుపు చర్యలను పాటించాలని స్పష్టం చేశారు.అంతేకాకుండా ఒకటి, రెండు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓ కార్యాచరణ ప్రకటిస్తుందని వెల్లడించారు. యుద్ధ పరిస్థితుల వల్ల దేశంపై భారం పడుతోందని సీఎం వ్యాఖ్యానించారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రభుత్వాలతోపాటు పౌరులు కూడా బాధ్యతగా ఉండాలని, తాత్కాలికంగా వచ్చే ఇబ్బందులు అధిగమించాలని సీఎం సూచించారు. ఈ క్రమంలోనే వర్క్ ఫ్రమ్ హోమ్ పై సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వంలోనూ ఈ తరహా విధానాన్ని అమలు చేసే పరిస్థితులు వస్తున్నాయని తెలిపారు.

**వర్క్ ఫ్రం హోం సాధ్యమా?**

గవర్నమెంటులోనూ వర్క్ ఫ్రం హోం విధానం తీసుకువస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటనపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. కోవిడ్ ఎఫెక్ట్ తో ఐటీతోపాటు మరికొన్ని రంగాల్లో వర్క్ ఫ్రం హోం విధానం అమలు చేసిన విషయం తెలిసిందే. ఐటీ సెక్టార్ లో ఇప్పటికీ కొన్ని సంస్థలు ఈ విధానాన్ని అమలు చేస్తుండగా, గత ఏడాది నుంచి కొన్ని కంపెనీలు వర్క్ ఫ్రం హోం విధానానికి స్వస్తి చెప్పాయి. అయితే తాజా పరిస్థితులతో రవాణా ఖర్చులు భారంగా మారడంతో మళ్లీ వర్క్ ఫ్రం హోం విధానంవైపు మళ్లేలా ప్రయత్నాలు మొదలు అయ్యాయని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం కూడా వర్క్ ఫ్రం హోం పాటిస్తుందంటూ సీఎం చంద్రబాబు చేసిన సూచనలు ఆసక్తికరంగా మారాయి. ప్రభుత్వంలో పలు విభాగాలు ఉండగా, ఏ విభాగాలలో ఈ పద్ధతి ప్రవేశపెట్టే అవకాశం ఉందన్న చర్చ ఎక్కువగా జరుగుతోంది. దీనిపై రెండు రోజుల్లోనే ప్రకటన చేస్తామని సీఎం చెప్పడంపై సర్వత్రా ఆసక్తికర చర్చ జరుగుతోంది.

## బెయిల్ రద్దు : డ్రైవర్ హత్య కేసులో ఎమ్మెల్సీ అనంతబాబుకు షాక్

**హైదరాబాద్ పెన్ పవర్:** డ్రైవర్ హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ ఎమ్మెల్సీ అనంత బాబు బెయిల్ రద్దు చేస్తూ ప్రత్యేక కోర్టు తీర్పునిచ్చింది. బెయిలు షరతులకు విరుద్ధంగా సాక్ష్యులను బెదిరించారనే కారణంతో ఆయన బెయిలును రద్దు చేస్తున్నట్లు న్యాయస్థానం ప్రకటించింది. దీంతో హత్య కేసు విచారణ పూర్తయ్యే వరకు ఎమ్మెల్సీ అనంతబాబు జైలులోనే ఉండాల్సివుంటుందని అంటున్నారు. 2022 మే 19న ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్యకు గురయ్యారు. హతుడి మృతదేహాన్ని ఎమ్మెల్సీ కారులో తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించడం అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. ఈ కేసులో అప్పట్లోనే అనంతబాబు అరెస్టు అవ్వగా, కేసు దర్యాప్తు పూర్తయిన తర్వాత సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేసింది. అయితే ఎమ్మెల్సీ అనంతబాబుతోపాటు మరికొందరికి నేరంతో సంబంధం ఉందని హతుడి కుటుంబ సభ్యులు న్యాయపోరాటం చేయడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసు పునర్విచారణకు ఆదేశించడంతో ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గను సైతం నిందితుల జాబితాలో చేర్చారు. అదే సమయంలో కేసు విచారణ త్వరగా పూర్తి చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఏప్రిల్ లో రోజువారి ట్రైల్ ప్రారంభించి నవంబరు నాటికి తీర్పు వెలువరించాలని ఆదేశించింది. ఈ పరిస్థితుల్లో గత నెలలో రాజమండ్రిలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేశారు. సాక్ష్యుల విచారణకు కోర్టు నిర్ణయించడంతో ఎమ్మెల్సీ అనంతబాబు వారిని ప్రలోభాలకు గురిచేశారని పోలీసులకు ఫిర్యాదు అందింది.



దీంతో గత నెలలో సాక్ష్యులను బెదిరించారనే ఆరోపణలపై అనంతబాబుపై మరో కేసును కాకినాడలోని సర్పవరం పోలీసులు నమోదు చేశారు. ఆ తర్వాత కోర్టు విచారణకు హాజరైన అనంతబాబును రాజమహేంద్రవరంలో అరెస్టు చేశారు. అప్పటి నుంచి రాజమహేంద్రవరం ప్రత్యేక జైలులోనే అనంతబాబు ఉన్నారు. ఈ కేసు ఇలా నడుస్తుండగా, పాత కేసులో ఆయన బెయిలు రద్దు అయింది. దీంతో ఇప్పట్లో అనంతబాబు జైలు నుంచి బయటపడే మార్గం కనిపించడం లేదని అంటున్నారు.డ్రైవర్ హత్య కేసులో ఏ1 ఎమ్మెల్సీ అనంతబాబు బెయిల్ పై ఉంటూ సాక్ష్యులను బెదిరించినట్లు పోలీసులు ఆధారాలు సమర్పించారు. సాక్ష్యులకు డబ్బులు ఇవ్వడంతోపాటు చంపేస్తామని బెదిరించారని పోలీసుల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఆయన బయట ఉంటే హత్య కేసు విచారణకు ఆటంకం కలుగుతుందని, హత్య కేసు విచారణను ఈ ఏడాది నవంబరులోగా ముగించాలని సుప్రీంకోర్టు షరతు పెట్టిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. కేసు విచారణ వేగంగా పూర్తి చేయాలన్నా, సాక్ష్యులకు రక్షణ కల్పించాలన్నా అనంతబాబును జైలులో ఉంచాల్సిందేనని పోలీసులు స్పష్టం చేయడంతో వారి వాదనతో ప్రత్యేక కోర్టు న్యాయాధికారి ఏకీభవించారని న్యాయవాద వర్గాలు చెప్పాయి. దీంతో అనంతబాబు బెయిలు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## చంద్రబాబు.. ది గ్రేట్...

**విజయవాడ, మే 13, పెన్ పవర్:**
ఏపీ సీఎం చంద్రబాబు వయసుకు మించి కష్టపడుతున్నారు. ఒకవైపు రాష్ట్ర పాలన చూస్తూనే మరోవైపు జాతీయ స్థాయిలో సైతం నిత్య పర్యటనలు చేస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించే క్రమంలో వరుసగా భేటీలు జరుపుతున్నారు. నిత్య సమీక్షలు కొనసాగుతున్నాయి. ఢిల్లీలో సంప్రదింపులు జరుపుతున్నారు. ఎన్ డి ఏ సమావేశాలకు హాజరవుతున్నారు. బిజెపితో పాటు ఎన్డీఏ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ప్రభుత్వాలు కొలువు తీరుతున్న సమయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు హాజరవుతున్నారు. గత వారం రోజులుగా సీఎం చంద్రబాబు షెడ్యూల్ ను పరిశీలిస్తే.. క్షణం తీరిక లేకుండా గడుపుతున్న పరిస్థితి. ఈ వయసులో కూడా ఆయన కష్టపడుతున్న తీరు మాత్రం ఆకట్టుకుంటుంది.పశ్చిమ బెంగాల్లో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. 15 సంవత్సరాల మమతా పాలనను తెరదించుతూ కాషాయ జండా ఎగురవేసింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సువేందూ అధికారి ప్రమాణం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీతో పాటు ఎన్డీఏ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఏపీ సీఎం చంద్రబాబు కు ప్రత్యేక ఆహ్వానం అందింది. దీంతో కార్యక్రమానికి హాజరైన చంద్రబాబుకు కేంద్ర పెద్దలు గౌరవభావంతో చూశారు. చాలా ప్రాధాన్యం ఇచ్చారు. బిజెపిలో కొనసాగుతున్న బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి చంద్రబాబుకు పాదాభివందనం చేశారు.పశ్చిమ బెంగాల్ సీఎం ప్రమాణ స్వీకారం నుంచి హైదరాబాద్ చేరుకున్నారు చంద్రబాబు. అదే సమయంలో హైదరాబాద్ వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ నేరుగా చంద్రబాబు నివాసానికి చేరుకున్నారు. అక్కడ గంటపాటు గడిపారు మోడీ. అయితే ఆ పర్యటన ముగిసిన వెంటనే ఢిల్లీ బాట పట్టారు చంద్రబాబు. నిన్న రోజంతా

కేంద్ర మంత్రులను కలిసి ఏపీలో కీలక ప్రాజెక్టుల కు సంబంధించిన అంశాలను చర్చించారు. సాయంత్రం ఉన్నత స్థాయి సదస్సులో సైతం పాల్గొన్నారు. ఢిల్లీలోనే రాత్రి బస చేశారు. మంగళవారం అస్సాం లో సీఎం ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. ఇలా క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు సీఎం చంద్రబాబు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ పాలనలో క్షణం తీరిక లేకుండా ఉంటూనే.. జాతీయస్థాయిలో సైతం అన్ని కార్యక్రమాలకు హాజరవుతున్నారు. నిజంగా చంద్రబాబు ఓపికకు హాట్సాఫ్ చెప్పాల్సిందే.

# SRHకు దెబ్బ మీద దెబ్బ.. అసలే ఘోరంగా ఓడిపోయిన బాధలో ఉంటే..



**హైదరాబాద్ పెన్ పవర్:** గుజరాత్ చేతిలో ఘోరంగా ఓటమి పాలైన సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు దెబ్బ మీద దెబ్బ పడింది. స్లో ఓవర్ రేట్ కారణంగా ాా=ఎ జట్టు కెప్టెన్ పాట్ కమిన్స్?కు భారీగా జరిమానా పడింది. గుజరాత్ తో జరిగిన మ్యాచ్?లో స్లో ఓవర్ రేట్ కారణంగా కమిన్స్?కు బీసీసీఐ 12 లక్షల జరిమానా విధించింది. ఐపీఎల్ 2026 సీజన్?లో ఒక మ్యాచ్‌లో ాా=ఎ స్లో ఓవర్ రేట్ కారణంగా ఫైన్ ఎదుర్కోవడం ఇదే మొదటిసారి. ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్?లోని ఆర్టికల్ 2.22 ప్రకారం ఈ జరిమానా విధించినట్లు బీసీసీఐ స్పష్టం చేసింది.

గుజరాత్ జట్టుతో జరిగిన మ్యాచ్?లో ఏమైందంటే.. పవర్‌ప్లేలోనే సన్‌రైజర్స్ నాలుగు వికెట్లు కోల్పోయింది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, స్మరణ్ రవిచంద్రన్ తక్కువ స్కోరుకే పెవిలియన్ బాట పట్టారు. తొలి ఆరు ఓవర్లలో కగిసో రబడ 3 వికెట్లు తీయగా, సిరాజ్ కూడా ఒక వికెట్ తీశాడు. 10వ ఓవర్ ముగిసేసరికి 60/7 స్కోరుతో నిలిచారు. చివరికి.. 14.5 ఓవర్లలో 86 పరుగులకే ాా=ఎ ఆలౌట్ అయింది. గుజరాత్ బౌలర్లలో.. జాసన్ హోల్డర్ 3 వికెట్లు పడగొట్టగా, ప్రసీద్ కృష్ణ రెండు వికెట్లు, రషీద్ ఖాన్ చివరి వికెట్ తీశారు.

ఐపీఎల్ నియమ నిబంధనల ప్రకారం, ఇరు జట్లు తమ నిర్ణీత 20 ఓవర్లను 90 నిమిషాలలోపు రెండు స్ట్రాటజిక్ టైమ్‌అవుట్?లతో ఫినిష్ చేయాలి. అయితే, ఐ=ూ తీసుకున్న సమయం, గాయం, సడన్ డ్రింక్స్ బ్రేక్ సమయాన్ని ఈ గంటన్నర నుంచి మినహాయిస్తారు. అయినప్పటికీ, ఒక జట్టు తమ 20 ఓవర్లను నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేయకపోతే, అప్పుడు జరిమానా విధిస్తారు. జట్టు మొదటిసారి స్లో ఓవర్ రేట్ సమస్యను ఎదుర్కొంటే, బౌలింగ్ జట్టు కెప్టెన్ మాత్రమే రూ.12 లక్షల జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఇతర ఆటగాళ్ళకు జరిమానా విధించరు.

మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఎస్ఆర్‌హెచ్ 82 రన్స్ తేడాతో గుజరాత్ టైటాన్స్ చేతిలో ఓడింది. టాస్ ఓడిన గుజరాత్ 20 ఓవర్లలో 168/5 స్కోరు చేసింది. సాయి సుదర్శన్ (44 బాల్స్‌లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 61), వాషింగ్టన్ సుందర్ (33 బాల్స్‌లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 50) రాణించారు. తర్వాత హైదరాబాద్ 14.5 ఓవర్లలో 86 రన్స్‌కే ఆలౌటైంది. ాా=ఎ? చరిత్రలోనే ఇదే అత్యల్ప స్కోరు. కమిన్స్ (19) టాప్ స్కోరర్. ఇక మెగా లీగ్?లో వరుసగా ఐదు విజయాలు నమోదు చేయడం జీటీకి ఇది రెండోసారి. రబాడాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

# ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్.. బంగ్లా ఆటగాళ్ల పంట పండింది!

**పాక్‌పై 104 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ చారిత్రక టెస్ట్ విజయం**

**కెప్టెన్ నజ్ముల్ షాంటోకు కెరీర్ బెస్ట్ 23వ ర్యాంక్**

**బ్యాటింగ్‌లో ముష్ఫికర్, మోమినుల్... బౌలింగ్‌లో తైజుల్, నహీద్ రాణా జంప్**

**వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పట్టికలో పాకిస్థాన్‌ను దాటేసిన బంగ్లా**



**హైదరాబాద్ పెన్ పవర్:** మిర్పూర్ వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన తొలి టెస్టులో 104 పరుగుల తేడాతో చారిత్రక విజయం సాధించిన బంగ్లాదేశ్, ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో తమ తొలి గెలుపును నమోదు చేసింది. ఈ అద్భుత విజయంతో బంగ్లాదేశ్ ఆటగాళ్లు తాజాగా విడుదలైన ఐసీసీ పురుషుల టెస్ట్ ప్లేయర్ ర్యాంకింగ్స్‌లో భారీగా లాభపడ్డారు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఆటగాళు తమ ర్యాంకులను గణనీయంగా మెరుగుపరుచుకున్నారు. ఈ మ్యాచ్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షాంటో, బ్యాటింగ్‌లో అదరగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో తన తొమ్మిదో టెస్ట్ సెంచరీ సాధించిన అతను, రెండో ఇన్నింగ్స్‌లో కీలకమైన 87 పరుగులు చేశాడు. ఈ ప్రదర్శనతో ఏకంగా 16 స్థానాలు ఎగబాకి, కెరీర్‌లోనే అత్యుత్తమంగా 23వ ర్యాంకుకు చేరుకున్నాడు. మరోవైపు తొలి ఇన్నింగ్స్‌లో 71, రెండో ఇన్నింగ్స్‌లో 22 పరుగులు చేసిన మాజీ కెప్టెన్ ముష్ఫికర్ రహీమ్ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని 26వ స్థానానికి చేరాడు. అలాగే 91, 56 పరుగులతో రాణించిన మోమినుల్ హక్ 12 స్థానాలు ఎగబాకి 35వ స్థానంలో నిలిచాడు. అటు బౌలింగ్‌లోనూ బంగ్లా ఆటగాళ్లు సత్తా చాటారు. రెండు ఇన్నింగ్స్‌లలోనూ రెండేసి వికెట్లు పడగొట్టిన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ తైజుల్ ఇస్లాం, మూడు స్థానాలు మెరుగుపరుచుకుని 13వ ర్యాంకుకు చేరుకున్నాడు. ఇక, రెండో ఇన్నింగ్స్‌లో 92 పరుగులకే 5 వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన ఫాస్ట్ బౌలర్ నహీద్ రాణా, ఐదు స్థానాలు మెరుగుపరుచుకుని 64వ స్థానంలో నిలిచాడు. ఈ ఓటమిలోనూ పాకిస్థాన్‌కు కొన్ని సానుకూల అంశాలు చోటుచేసుకున్నాయి. అరంగేట్రం చేసిన అబ్దుల్లా ఫజల్ తొలి ఇన్నింగ్స్‌లోనే సెంచరీతో ఆకట్టుకుని 75వ ర్యాంకులో, రెండు ఇన్నింగ్స్‌లలోనూ హాఫ్ సెంచరీలు సాధించిన అజాన్ అవాయిస్ 82వ ర్యాంకులో నిలిచారు. తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీసిన సీమ్ బౌలర్ మహమ్మద్ అబ్బాస్, 28వ స్థానంతో తిరిగి ర్యాంకింగ్స్‌లోకి ప్రవేశించాడు. ఈ విజయంతో బంగ్లాదేశ్ ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ స్టాండింగ్స్‌లో పాకిస్థాన్‌ను వెనక్కి నెట్టింది.

# ఐపీఎల్ అభిమానులకు అలర్ట్.. నకిలీ ఐపీఎల్ వెబ్‌సైట్ల జోరు.. డబ్బు, డేటా రెండూ చోరీ!





**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవ్యాప్తంగా ఐపీఎల్ ఫీవర్ తారాస్థాయికి చేరుకుంటున్న వేళ, ఇదే అదునుగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఐపీఎల్ అభిమానుల బలహీనతలను ఆసరాగా చేసుకుని, వారిని మోసం చేసేందుకు 1,000కి పైగా నకిలీ వెబ్‌సైట్లను సృష్టించారు. టికెట్లు, ఉచిత స్ట్రీమింగ్ పేరుతో ఈ మోసాలకు పాల్పడుతున్నారని సైబర్ సెక్యూరిటీ సంస్థ క్లౌడ్‌సెక్ తన నివేదికలో వెల్లడించింది. క్లౌడ్‌సెక్ విశ్లేషణ ప్రకారం నకిలీ ఐపీఎల్ టికెట్లు అమ్మేందుకు 600కు పైగా ఫేక్ డొమైన్లు, ఉచితంగా మ్యాచ్ చూపిస్తామంటూ నమ్మించే 400కు పైగా నకిలీ స్ట్రీమింగ్ వెబ్‌సైట్లు ఆన్‌లైన్‌లో చురుకుగా ఉన్నాయి. ముఖ్యంగా కీలకమైన మ్యాచ్‌ల సమయంలో చివరి నిమిషంలో టికెట్ల కోసం లేదా ఉచిత స్ట్రీమింగ్ కోసం వెతికే అభిమానుల ఆతృతను నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారని నివేదిక స్పష్టం చేసింది.

**మోసం చేసే తీరు చాలా పక్కాగా..**

ఈ నకిలీ వెబ్‌సైట్లను అచ్చం అసలు ప్లాట్‌ఫామ్‌ల మాదిరిగానే రూపొందిస్తున్నారు. అధికారిక లోగోలు, లేఅవుట్‌లు, బుకింగ్ విధానాలను కాపీ కొట్టి, అభిమానులను సులభంగా నమ్మిస్తున్నారు. సీట్లు ఎంచుకోమని, వ్యక్తిగత వివరాలు నమోదు చేయమని చెప్పి.. యూపీఐ , కార్డులు లేదా క్యూఆర్ కోడ్‌ల ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నారు. డబ్బులు చెల్లించాక, కొందరికి నకిలీ బుకింగ్ ఐడీ, క్యూఆర్ కోడ్‌లతో కూడిన ఫేక్ పీడీఎఫ్ టికెట్లను కూడా పంపిస్తున్నారు. తీరా స్టేడియం గేట్ల వద్దకు వెళ్లాక గానీ అది మోసమని బాధితులకు తెలియడం లేదు. "ఈ మోసాలు ఎంత పకడ్బందీగా మారాయంటే, నేరగాళ్లు కేవలం నకిలీ టికెట్లు అమ్మడమే కాదు.. బాధితుల డేటాను సేకరించి, దాన్ని భవిష్యత్తులో ఇతర మోసాలకు వాడుకోవడమో? లేదా అమ్ముకోవడమో? చేస్తున్నారు. మెటా పిక్సెల్ వంటి టూల్స్‌ను ఉపయోగించి తమ మోసపూరిత ప్రచారాలను ట్రాక్ చేస్తూ, వాటిని మరింత మెరుగుపరుచుకుంటున్నారు" అని క్లౌడ్‌సెక్ పరిశోధకుడు సౌరజీత్ మజుందర్ వివరించారు.


**ఉచిత స్ట్రీమింగ్ వెబ్‌సైట్లతో మరో ముప్పు**

నకిలీ టికెట్ల బెడద ఒకవైపు ఉంటే, "ఐపీఎల్ ఫ్రీ లైవ్ స్ట్రీమ్" వంటి పదాలతో సెర్చ్ చేసే వారిని లక్ష్యంగా చేసుకుని మరో రకమైన మోసానికి పాల్పడుతున్నారు. ఈ నకిలీ స్ట్రీమింగ్ వెబ్‌సైట్లు యూజర్ల ఫోన్లు, కంప్యూటర్లలోకి మాల్‌వేర్‌ను పంపేందుకు, అనుమానాస్పద లింకులకు దారి మళ్లించేందుకు, కీలకమైన పాస్‌వర్డ్‌లను దొంగిలించేందుకు గేట్‌వేలుగా పనిచేస్తున్నాయని నివేదిక హెచ్చరించింది. అందుకే ఐపీఎల్ అభిమానులు టికెట్లు కొనుగోలు చేయడానికి, మ్యాచ్‌లు చూడటానికి కేవలం అధికారిక, విశ్వసనీయమైన ప్లాట్‌ఫామ్‌లను మాత్రమే ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# నోరా కిల్లింగ్ లుక్: కాసులు, నాణేలతో ఒళ్లంతా సింగారం



రాయల్ బ్లూ గ్లామ్ లుక్‌లో శ్రీముఖి స్టన్స్



గ్లోబల్ డాన్సింగ్ సెన్సేషన్ నోరా ఫతేహి తన సరికొత్త ఫోటోషూట్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. "నీ ఒళ్లు బంగారం కాను..!" అనేలా మెరిసిపోతున్న ఆ దివ్యమైన రూపం అభిమానుల కళ్లను తిప్పుకోనివ్వడం లేదు. భారతీయ సంప్రదాయ ఆభరణాలు... ఉత్తర ఆఫ్రికా సంస్కృతుల అరుదైన కలయికతో రూపొందించిన ఈ లుక్ నోరా కెరీర్‌లోనే అత్యంత ప్రయోగాత్మకమైన.. అందమైన ఫోటోషూట్‌లలో ఒకటిగా నిలుస్తోంది. ఈ ఫోటోషూట్ వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం ఒక –జల దేవత– రూపానికి ప్రాణం పోయడం. ఇందులో భాగంగా నోరా శరీరం నిండా బంగారు కాసులు, నాణేలతో కూడిన ఆభరణాల దుస్తులను డిజైన్ చేయించడం ఆసక్తిని కలిగించింది. ఈ గోల్డ్ జ్యువెలరీ ఈ బ్యూటీకి ఒక రాజసం ఉట్టిపడే భారతీయ సౌందర్యాన్ని అందించింది. నోరా నిజంగా ఒక దేవతలా వెలిగిపోతోంది. కేవలం భారతీయతకే పరిమితం కాకుండా.. ఈ లుక్‌లో నోరా తన మూలాలను కూడా ప్రతిబింబించింది. మొరాకోకు చెందిన –అమాజిగ్ బెర్బర్– సంస్కృతికి చెందిన బాడీ టాటూలను ఇందులో జోడించారు. ఈ టాటూలు, బంగారు ఆభరణాల కలయిక భారత్ – మొరాకో అనే రెండు భిన్నమైన ప్రపంచాల అద్భుతమైన సమ్మేళనంలా కనిపిస్తోంది. ఈ –ఫ్యూషన్– స్టైల్ నోరా ఫ్యాషన్ సెన్స్‌కు నిదర్శనంగా నిలుస్తోంది. నోరా ఫతేహి తన ఫిట్‌నెస్ – గ్రేస్‌తో ఈ లుక్‌కు పూర్తి న్యాయం చేసింది. కేవలం డ్యాన్స్‌లోనే కాదు.. ఫ్యాషన్ ప్రయోగాల్లోను తనే –క్వీన్– అని చాటుకుంది. సోషల్ మీడియాలో ఈ ఫోటోలు వైరల్ అవుతుండటంతో.. నెటిజన్లు నోరా అందానికి .. ఆ వినూత్న ఆలోచనకు ఫిదా అయిపోతున్నారు.



తమన్నా భాటియా చిక్ క్రాప్ టీ మరియు డెనిమ్ లుక్‌లో అద్భుతంగా ఉంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com